
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY

నల్లగొండ
5
గురువారం 29 మే 2025

డిగ్రీ బ్యాక్ లాగ్ ఫలితాల విడుదల
ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం 7
తోడల్లుళ్లను బలిగొన్న ఓవర్‌టేక్ 6

వార్డెన్ల కొరత తీరింది





» అన్ని హాస్టళ్లకూ నియామకం » పెరగనున్న పర్యవేక్షణ » హాస్టళ్లకు పక్కాభవనాలు నియమించాలనే డిమాండ్

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇంతకాలం ఇన్‌చార్జీల పాలనతో సతమతమైన వసతి గృహ విద్యార్థులకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు వార్డెన్ల కొరతతో సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. ఒక్కొక్కరికీ రెండు, మూడు వసతి గృహాల బాధ్యతలు ఉండటంతో సరైన నిర్వహణ లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ వార్డెన్ పోస్టుల భర్తీ, నియామక ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ పోటీ పరీక్షకు సంబంధించి ఇటీవల ఫలితాలు రావడం, అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం వంటివి చకచకా జరిగాయి. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న సంక్షేమ వసతిగృహ అధికారుల పోస్టులను నూతనంగా నియమకమైన వారికి కేటాయించారు. వారికి వృత్యంతర శిక్షణ సైతం నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. దీంతో ఇంతకాలం ఇన్‌చార్జీలతో నడిచిన వసతిగృహాలకు ఈ విద్యాసంవత్సరం నుంచి వసతి గృహ నూతన అధికారులు రానున్నారు.

ఇకనైనా సమస్యలు పరిష్కారమయ్యేనా?

జిల్లాలో పూర్తిస్థాయి వార్డన్లు లేకపోవడంతో పలు ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలు ఇన్‌చార్జీల పాలనలో కొనసాగాయి. దీంతో వసతి గృహాల నిర్వాహణ నామమాత్రంగా కొనసాగింది. సరైన పరిశుభ్రత లేకపోవడం, మెనూ అమలులో ఫిర్యాదులు వంటివి తరచూ అధికారుల దృష్టికి వచ్చాయి. అయినా వార్డెన్ల కొరత కారణాలతో పెద్దగా ఫలితం లేకుండా పోయేది. భవనాల కప్పులు పెచ్చులూడుతున్నా, మరుగుదొడ్లు, స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రస్తుతం ఒక్కో వసతి గృహానికి ఒక్కో వార్డెన్ రావడంతో సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థులు భావిస్తున్నారు.

అద్దెభవనాలతో అవస్థలు

జిల్లాలోని చాలా వసతి గృహాలకు పక్కా భవనాల అవసరం ఉంది. అద్దె భవనాల్లో వసతులు లేక మిగతా 8వ పేజీలో...

జిల్లాలో ఇది పరిస్థితి

జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన మొత్తం 59 వసతి గృహాలు ఉన్నాయి. అందులో ప్రీమెట్రిక్ హాస్టళ్లు 44, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 15 ఉన్నాయి. వీటిలో సుమారు 4,606 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న 59 వసతి గృహాలకు ఇంతకాలం కేవలం 28 మంది రెగ్యులర్ వార్డెన్లు మాత్రమే ఉన్నారు. మిగతా వసతిగృహాలన్నీ ఇన్‌చార్జీల పాలనలో కొనసాగాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వం వార్డెన్లను నియమించడంతో 31 మంది వార్డెన్లు జిల్లాకు కేటాయించారు. వీరితో సాంఘిక సంక్షేమ శాఖలో ఉన్న ఖాళీలనీ భర్తీ చేశారు. అదేవిధంగా ఎస్సీ వసతి గృహాలకు చెందిన 46 హాస్టల్స్ ఉన్నాయి. అందులో ప్రీమెట్రిక్ 25, పోస్ట్‌మెట్రిక్ 21 హాస్టల్స్ ఉన్నాయి. కాగా ప్రీమెట్రిక్‌లో 1,924, పోస్ట్‌మెట్రిక్ లో 2,300 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ వసతి గృహాల్లో 46మందికి 32మంది రెగ్యులర్ వార్డెన్లు మాత్రమే ఉన్నారు. ఇంతకాలం మిగతా వసతిగృహాల బాధ్యతలను ఇన్‌చార్జీలకు అప్పగించారు. అయితే నూతనంగా వార్డెన్లను నియమించడంతో జిల్లాలో సమస్య తీరినట్టయింది. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి జిల్లాలో 27 వసతిగృహాలు ఉన్నాయి. ఇంతకాలం ఏడుగురు వార్డెన్లు ఉండగా, ఖాళీగా ఉన్న మిగతా వాటిని ప్రభుత్వం పూర్తిస్థాయిలో భర్తీ చేసింది. ఖాళీల భర్తీతో హాస్టళ్లపై పర్యవేక్షణ పెరగడంతోపాటు విద్యార్థుల సమస్యలు తీరనున్నాయని భావిస్తున్నారు.

విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు

బిల్లు తీసుకోవాలి

» నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు అమలు
» జేడీఏ శ్రవణ్‌కుమార్
» 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



నల్లగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి 'ఆంధ్రజ్యోతి' బుధవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో ఫోన్‌చేసి సలహాలు, సూచనలు పొందారు. విత్తనాలతో పాటు రైతుభరోసాపై పలు ప్రశ్నలు అడిగారు. దీనికి తోడు ఏ విత్తనాలు వినియోగించాలి? ఏ ఎరువులు వాడాలనేదానిపై సలహాలు తీసుకున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ అమలు చేస్తామని జేడీఏ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, శివప్రసాద్, కీర్తి, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి మండలంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? : అంజయ్య, రైతు, చింతపల్లి

జేడీఏ: చింతపల్లి మండలంలో పత్తి విత్తనాలతో పాటు అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. స్వయంగా అధికారులు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఏవైనా విత్తన సమస్యలు ఎదురైతే అధికారులను సంప్రదించాలి.

తెగుళ్ల నివారణకు ఎలాంటి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి? కె.లింగ మయ్య, డిండి

జేడీఏ: పత్తిలో బీటీ-2 రకాలు ఉన్నాయి. ఈ విత్తనాల మిగతా 8వ పేజీలో...

సాగర్ జలవిద్యుత్ కేంద్రంలో

టర్బైన్‌కు మరమ్మతులు


నాగార్జునసాగర్‌కు బీహెచ్ఈఎల్ నుంచి తీసుకువచ్చిన టర్బైన్‌లోని పరికరాలు

» అరిగిన టర్బైన్ వెయిన్స్.. టర్బైన్ పరికరాలు, వెయిన్స్ ఏర్పాటు
» రూ.70లక్షల వ్యయంతో మరమ్మతులు
» జూన్ 30 నాటికి పనులు పూర్తి: జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్

నాగార్జునసాగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొదటి టర్బైన్‌కు మరమ్మతులు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉన్నాయి. వాటిల్లో మొదటి టర్బైన్ హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కి టెక్నాలజీకి సంబంధించింది కాగా మిగతా 7 టర్బైన్లు జపాన్‌కు చెందినవి. వీటిలో బీహెచ్ఈఎల్‌కి చెందిన టర్బైన్ 110మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, జపాన్ పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన టర్బైన్లు 100.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటుంది. మొదటి టర్బైన్‌కు మరమ్మతులు చేసి 20 సంవత్సరాలు అవుతుండటంతో క్యాపిటల్ ఓవరాల్ చేస్తున్నారు. మొదటి టర్బైన్ వెయిన్స్ అరగడంతో (వార్న్ అవుట్) విద్యుదుత్పత్తి సమయంలో నీటి వృథాతో (నీరు లీకేజీ కావడంతో) పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి చేయడం కష్టమవుతుందని సీఈ తెలిపారు. దీంతో బీహెచ్ఈఎల్ నుంచి రూ.70లక్షల వ్యయంతో టర్బైన్ పరికరాలు, నూతన వెయిన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని మెకానికల్ విభాగంలో ఇంజనీర్లు మరమ్మతులు చేస్తున్నారని, మొదటి టర్బైన్ మరమ్మతులు జూన్ 30వ తేదీ వరకు పూర్తి చేస్తామని, బీహెచ్ఈఎల్ నుంచి నూతన టర్బైన్ తీసుకువచ్చామన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థల పరిశీలన


ప్రభుత్వ స్థలం వివరాలు అడిగితెలుసుకుంటున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్

నాగార్జునసాగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): సాగర్ నియోజవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయడంతో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్ బుధవారం సాగర్ హిల్‌కాలనీలో స్థల పరిశీలన చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), అనుముల మండలాల్లో స్థల పరిశీలన చేశారు. పెద్దవూర మండలంలో చలకుర్తి గ్రామంలో ఎన్ఎస్పీ భూములను గత వారం కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. తాజాగా, సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాల వెనక వైపున నాట్కో ఫార్మా క్వార్టర్ల పక్కన ఉన్న ఎన్ఎస్పీ, అటవీ, రెవెన్యూ భూములను సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి జానారెడ్డి నివాసంలో గంటన్నరపాటు సమావేశమయ్యారు. ఆయన వెంట సాగర్ ఇన్‌చార్జి ఎస్ఈ మల్లిఖార్జున్‌రావు, పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అటవీశాఖ సాగర్ రేంజర్ రాఘవేంద్ర, ఎఫ్ఎస్‌వో రమేష్, ఉన్నారు.

మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా సబ్ కలెక్టర్ అమిత్

మిర్యాలగూడ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వెంటనే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్య విధులకు సక్రమంగా హాజరు కాని కారణంగా డైరెక్టరేట్‌కు సరెండర్ చేస్తున్నట్లు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సుబ్రహ్మణ్యం, నరేందర్, వెంకట్‌కు షోకాజ్ జారీచేశారు.

అత్యధికంగా వరి సాగయ్యే రాష్ట్రంగా తెలంగాణ

» రైతులు యూరియా వాడకం తగ్గించాలి
» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా, ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల

చిట్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కువ వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, అలాగే రైతుల నుంచి ఎక్కువ ధాన్యం కొనుగోలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించిందన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. వానాకాలం నాట్లు వేసేలోగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేస్తామని, రైతును నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు తక్కువగా నీరు అవసరమయ్యే పంటలను ఎంచుకోవాలని, యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. ఆయిల్‌పామ్, వక్క, జాజికాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 10వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగవుతోందని, ఇక్కడ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థిరమైన, శాశ్వతమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని కొనియాడారు. వ్యవసాయాన్ని పండగ చేసేందుకు రైతులు సహకరించాలన్నారు.

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎంతో చరిత్ర ఉన్న చిట్యాల మార్కెట్ గౌరవాన్ని కొత్త పాలక వర్గం నిలబెట్టాలన్నారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసి కార్యకర్తలను సంతృప్తి పరచాలన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, చిట్యాలలో జాతీయరహదారిపై నిర్మించే ఫ్లైఓవర్ పరిధిలో మూడు అండర్‌పాస్‌లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, చిట్యాల మండలంలోని ఎనిమిది గ్రామాలను చిట్యాల మార్కెట్ పరిధిలో చేర్చాలని, నార్కట్‌పల్లి సబ్ మార్కెట్‌ను మార్కెట్‌గా మార్చాలని కోరారు. అంతకుముందు చిట్యాల మార్కెట్ ఆధ్వర్యంలో రూ.1.40కోట్లతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి తుమ్మల ప్రారంభించారు. అనంతరం చిట్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నర్రా వినోదమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా అయితరాజు యాదయ్య, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ ఏడీ చాయదేవి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుంకరి మల్లేష్‌గౌడ్, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ

శిశు విక్రయ ముఠాకు బేడీలు

- 13 మంది ముఠాసభ్యుల అరెస్ట్
- 28 మంది శిశువుల విక్రయం
- 10 మందిని సంరక్షించిన పోలీసులు
- నిందితుల్లో ఒకరు యూపీలోని లక్నో జైలులోనే..

వివరాలు మెయిన్ 14లో..

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

» మూడున్నర ఏళ్లలో 20వేల ఇందిరమ్మ ఇళ్లు
» కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుకు మంజూరు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌లు అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలో నియోజకవర్గానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పారదర్శకంగా, శాస్త్రీయంగా రూపొందించినట్లు తెలిపారు. మొదటి విడత ఇల్లురాని వారు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామన్నారు. ఇసుకను ఉచితంగా ప్రభుత్వమే అందజేస్తుందని, అందుకు ఆర్డీవో, తహసీల్దార్‌కు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాపీని చూపించాలని కోరారు. దేవరకొండ నియోజకవర్గంలో 2346 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): లూజ్, నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు నకిలీ విత్తనాలు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ముందుగానే వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున పంటల సాగులో రైతులు ఇబ్బందులుపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్టు వ్యవసాయాధికారుల దృష్టికి వస్తే పోలీసుల సహకారం తీసుకుని వారిని కట్టడి చేయాలన్నారు. రాత్రి సమయాల్లో కల్తీ విత్తనాలు విక్రయించేవారు బృందాలుగా ఏర్పడి తిరుగుతారని, ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీచేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్

జీవాలకు టీకాలు వేయించాలి

పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్

మర్రిగూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): పశువులకు, గొర్రెలకు సీజన్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించేలని జిల్లా పశు వైద్యాధికారి జీవీ.రమేష్ సూచించారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని పశు వైద్య ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మే మాసంలో వర్షాలు కురుస్తున్నందున గొర్రెలు పశువులు లేత గడ్డిని మేయడం వల్ల వాటికి గొంతు, జబ్బ వాపు, గాలి కుంటూ వ్యాధులు, సోకే ప్రమాదం ఉందన్నారు. అందుకు టీకాలు వేయించాలన్నారు. అంతకుముందు పశు వైద్య ఆస్పత్రి భవనాన్ని ఆయన పరిశీలించారు వర్షాలు కురుస్తున్నందున భవనంపై నుంచి వర్షం నీరు కురుస్తుందని, మరమ్మతులు చేయించాలన్నారు. కొత్త ట్రావీస్‌ను ఏర్పాటు చేయాలని పశువైద్యాధికారి సురేందర్‌ను కోరారు. ఆయన వెంట పశుగణాంక సహాయకుడు ఎల్లేష్, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

● శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


వట్టిమర్తిలో సీసీరోడ్డు ప్రారంభంలో పాల్గొన్న చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి బస్‌స్టేజీ నుంచి గ్రామం వరకు నిర్మించిన 1.6కి.మీ సీసీరోడ్డును బుధవారం ప్రారంభించారు. స్థానికంగా జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ దేవత కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలకు మౌలిక వసతులతోపాటు రోడ్డు సౌకర్యం కూడా ఎంతో ముఖ్యమన్నారు. రహదారులు సరిగా ఉంటేనే ఆయా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చిట్యాల మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా పురుషుడు ఎన్టీఆర్

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు మహా పురుషుడు అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మధుసూదన్ రెడ్డి, నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్వీ యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి 43 ఏళ్లయినా ఎన్టీఆర్ ఆశయాలు, సిద్ధాంతాలను ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు పాటిస్తున్నాయన్నారు. నాడు ఎన్‌టీఆర్ తెలుగువారి ఔన్నత్యాన్ని కాపాడి దశదిశలా కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింపజేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కూరెళ్ల విజయ్‌కుమార్, ఆకునూరి సత్యనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, జంపాల చంద్రశేఖర్, బక్కతోళ్ళ ఇస్తారి, ఎంఏ రఫీక్, సిద్ధిక్, తేలు రవి, ఆరేళ్ల కొండలు, గంగాధర స్వరాజ్ పాల్గొన్నారు.

గిరాకేదీ గువ్వలచెన్నా?

కులవృత్తులకు ఒకప్పుడు ఎంతో ఆదరణ ఉండేది. ఎంతోమంది కులవృత్తులపై ఆధారపడి ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకునేవారు. అందుకే కులవృత్తి మానకురా గువ్వల చెన్నా అన్నది ఒకప్పటి నానుడి. రానురాను మారుతున్న కాలనుగుణంగా కులవృత్తులకు ఆదరణ కరువైంది. ప్రధానంగా ఏ కార్యమైనా ఉపయోగించే కుండల తయారు చేసే కుమ్మరుల పరిస్థితి ఇబ్బంది మారింది. రేడిమెడ్, ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్లను ముంచెత్తుతుండటంతో చేతిపై తయారు చేసే వస్తువులకు గిరాకీ తగ్గింది. దీంతో ఉపాధి లేక పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

(ఆంధ్రజ్యోతి-రాజాపేట)

● మట్టిపాత్రలకు తగ్గిన డిమాండ్ ● మార్కెట్‌ను ముంచెత్తుతున్న స్టీల్, ప్లాస్టిక్ వస్తువులు ● ఉపాధి కోసం కులవృత్తికి స్వస్తి చెబుతున్న కుమ్మరులు





ఆదరణ కరువై కులవృత్తులు చేసేవారు ఇతర ఉపాధి మార్గాల వైపు మళ్లుతున్నారు. అనాదిగా వస్తున్న చేతివృత్తికి స్వస్తిపలుకుతున్నారు. శుభ, అశుభ కార్యమైనా ముందుగా వాడేది మట్టి పాత్రలు. ఆ పాత్రలు తయారు చేసే కుమ్మరుల పరిస్థితి నేడు ఆగమ్యగోచరంగా మారింది. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో 200 వందలకు పైగా కుటుంబాలు ఉండగా 1000కి పైగా జనాభా ఉంది. కులవృత్తినే ఆధారంగా చేసుకుని జీవిస్తున్న 25 కుటుంబాలు ఉన్నాయి. మండలంలోని చల్లూరు, బొందుగుల, పాంకుంట, సింగారం, పారుపల్లి గ్రామాల్లో కొంతమంది కులవృత్తిని కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా మట్టితో సారెపై వివిధ రకాల మట్టిపాత్రలను తయారుచేస్తున్నారు. ఆయా పాత్రల తయారీకి వినియోగించే నల్ల మెత్తటిమట్టి కొంతకాలంగా చెరువులు నిండకపోవటంతో స్థానికంగా లభించడంలేదు. దీంతో 20 కిలోమీటర్ల దూరంలోని సిద్ధిపేట జిల్లా నాగపురి గ్రామంలోని చెరువుల నుంచి ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఐదు దశాబ్దాలుగా వృత్తిలో...

రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బోనాల వెంకటయ్య వయస్సు 70 ఏళ్లు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. వారికి కల వృత్తే ఆధారం. తాను 17 ఏళ్ల వయస్సు ఉన్నప్పటి నుంచి కుల వృత్తిని చేపట్టారు. వయస్సు మీద పడినా వృత్తిని మాత్రం విడవలేదు. సారెపై మట్టిపాత్రలను తయారుచేస్తున్నారు.రోజంతా కష్టపడిన కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. తయారుచేసిన మట్టి పాత్రలకు గిరాకీ లేకపోవడంతో జీవనం ఇబ్బందిగా మారింది. కుమ్మరులకు ప్రభుత్వం ఆసరా కల్పించి ఆదుకోవాలని ఆయన కోరారు.



కుటుంబ సభ్యులతో కలిసి

ఒండ్రుమట్టిని ఎండలో ఆరబోసి బాగా చూర్ణం చేసి నీటితో తడిసి ఒక రోజు మక్కబెడతారు. ఆ తర్వాత రోజు మట్టిని మెత్తగా అయ్యే వరకూ ఉదయం తొక్కుతారు. ఇందులో ఇంట్లో సభ్యులందరూ పాల్గొంటారు. మెత్తగా తయారు చేసుకున్న మట్టిని సారెపై పెట్టి పాత్రలను తయారు చేస్తుంటారు. ఆ మెత్తటి పాత్రలను సల్పతో నున్నగా తీర్చిదిద్దుతారు. అనంతరం ఈ పాత్రలను నీడలో కొద్దిరోజులు, ఎండలో కొద్దిరోజులు ఆరబెట్టి వాములో కాల్చుతారు. ఆ తర్వాత మట్టిపాత్రలు పూర్తిస్థాయిలో వినియోగానికి తయారవుతాయి.

వివిధ రకాల ఆకృతిలో

కుమ్మరులు మట్టితో వివిధ రకాల ఆకృతిలో వస్తువులను తయారు చేస్తుంటారు. కుండలు, కంచులు, గురుగులు, దీపపు ప్రమిదలు, వండే పాత్రలను తయారుచేస్తున్నారు. అయితే వాటిని విక్రయించడం కుమ్మరులకు ఇబ్బందిగా మారింది. రెడీమెడ్, ప్లాస్టిక్ వస్తువులు, అల్యూమినియం, స్టీల్ పాత్రలు మార్కెట్‌లోకి రావడంతో మట్టితో తయారుచేసిన పాత్రలకు గిరాకీ లేకుండాపోయింది. పండుగలు, జాతర్లు, శుభ, అశుభ కార్యాలకు మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నట్లు కుమ్మరులు తెలిపారు. మిగతా రోజుల్లో పెద్దగా గిరాకీ ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కరువై చేతి వృత్తిని వదిలి ఇతర వృత్తుల్లోకి వెళ్తున్న తరుణంలో కుమ్మరులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మట్టితో చేసిన వస్తువులు విక్రయించేందుకు ఏర్పాట్లు చేయాలని, అందుకు తగ్గ చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని రాజాపేట మండల కుమ్మరి సంఘం నాయకులు కోరారు.

ప్రభుత్వం సాయం చేయాలి

కుల వృత్తిపై ఆధారపడిన కుమ్మరుల పరిస్థితి అధ్వానంగా మారింది. నేడు ప్రజల నుంచి ఆదరణ కరువైంది. చేతి వృత్తులకు ఆసరా కల్పించేందుకు ఆధునిక యంత్రాలను అందించాలి. బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించి ప్రోత్సహించాలి.



బోనాల వెంకటేష్, కుమ్మరి సంఘం అధ్యక్షులు, రాజాపేట మండలం

కులవృత్తులను కాపాడాలి

కులవృత్తులను ప్రభుత్వ కాపాడాలి. కుమ్మరులు అనాదిగా కులవృత్తినే ఆధారంగా చేసుకుని చాలీచాలని జీవితాలను వెళ్లదీస్తున్నారు. ఉపాధి లేక ఇతర వృత్తులకు మారుతున్నారు. ఇంటిల్లిపాది కష్టపడినా కూలీ గిట్టడంలేదు. కుమ్మరులకు తగిన ప్రోత్సాహాన్ని ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.



చెలిమెళ్లపల్లి లక్ష్మణ్, కుమ్మరి సంఘం నాయకులు, రాజాపేట

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

వలిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వలిగొండ మండలం గురునాథ్‌పల్లి గ్రామానికి చెందిన పంతుల రఘుపతి (42) తనకున్న మూడు ఎకరాలతో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. దిగుబడి ఆశించినంత మేర రాక, సాగుకు చేసిన రూ.6లక్షలకు పైగా అప్పులు తీర్చలేక కొద్ది రోజులుగా మానోవేదనకు లోనవుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 24వ తేదీన సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అదే రోజు సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రఘుపతి భార్య లలిత బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. రఘుపతికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



రఘుపతి(ఫైల్)

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

మద్దిరాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన తునికి వెంకన్నగౌడ్(55) బుధవారం ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా జారి కింద పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య తునికి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. వెంకన్నగౌడ్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి మహేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సొసైటీ కార్మికులు రేసు లింగయ్య, లింగరాజు, జగన్, రేసు వెంకన్న, మమూనూరి రామయ్య, ఆకుల రమేష్, తాళ్లపల్లి మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు.



తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందిన వెంకన్న

గొర్లకాపరిని అకారణంగా కొట్టిన కానిస్టేబుల్

ఆత్మకూరు(ఎం), మే 28 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రానికి చెందిన ఓ గొర్రెల కాపరిని స్థానిక కానిస్టేబుల్ తీవ్రంగా కొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బుధవారం బాధితుడు, అతడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన మజ్జిగ విజయ, ఆమె కుమారుడు మజ్జిగ ప్రవీణ్(15) కలిసి ఈ నెల 26న నారాయణబావి ప్రాంతంలో గొర్రెలను మేపుతున్నారు. మధ్యాహ్నం దాహం వేయగా ప్రవీణ్ మంచినీటి కోసమని దగ్గరలోని రైతు వ్యవసాయ బావి బోరు మోటారు ఆన్ చేసి నీళ్లు తాగాడు. అదేవిధంగా తన వెంట తెచ్చిన బాటిల్ నింపుకొని మోటార్ నిలిపివేసి తల్లి దగ్గరకు వెళ్తున్నాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లింగంనాయక్ అనే కానిస్టేబుల్ ప్రవీణ్‌ను అడ్డుకుని మోటారు ఎందుకు పెట్టావురా? అంటూ దూషించాడు. అంతేకాకుండా ఆగ్రహంతో కర్ర తీసుకుని ప్రవీణ్ చేతులపై తీవ్రంగా కొట్టాడు. ఇంతలో తల్లి విజయ వచ్చి అడ్డుకుని నిలదీయడంతో కానిస్టేబుల్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దౌర్జన్యంగా తన కుమారుడిని కొట్టిన కానిస్టేబుల్ లింగంనాయక్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విజయ తెలిపింది. ఫిర్యాదు చేసి మూడు రోజులైనా కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయలేదని విలేకర్లకు వివరించారు. విజయ, ప్రవీణ్ ఆరోణలపై ఎస్ఐ కృష్ణయ్యను వివరణ కోరగా కానిస్టేబుల్ లింగంనాయక్‌పై ఉన్నతాధికారులకు రిపోర్టు పంపినట్లు తెలిపారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రవీణ్ తలిదండ్రులు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి ముగ్గురికి జైలు, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించామని, 9మంది మోతాదుకు మించి మద్యం తాగినట్లు తెలిపారు. వారిని బుధవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ బీపీ రమణ ఒకరికి మూడు రోజులు, మరో ఇద్దరికి ఒక రోజు జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అదేవిధంగా మిగిలిన ఆరుగురికి కలిపి రూ.6 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్పష్టం చేశారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

నేరేడుచర్లలో డీజే సీజ్, ఇద్దరిపై కేసు

నేరేడుచర్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో రామాపురం రోడ్డులో అనుమతులు లేకుండా డీజే పెట్టి సౌండ్ పొల్యూషన్‌కి పాల్పడిన కేసు నమోదు చేసి డీజే వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. మంగళవారం రాత్రి ఏపీ20వై 8173 నెంబరు గల డీజే వాహనం పెద్ద శబ్ధాలు పెట్టడంతో వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా డీజేలు పెట్టవద్దని, పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

వలిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి) : పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని దుప్పెల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో పేకాడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. పేకాడుతున్న వెల్పుల నర్సింహ, బెంజంకి బిక్షం, బొమ్మగాని మారయ్య, గునగంటి స్వామి, నిమ్మని వెంకటయ్య, కీసరి రామచందర్‌లు పట్టుబడ్డారని ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.7800 నగదు, 6 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తోడల్లుళ్లను బలిగొన్న ఓవర్‌టేక్

● ఉమ్మడి జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి



దేవరకొండలో లారీ వెనక చక్రాల కింద పడి మృతి చెందిన శ్రీశైలం

దేవరకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలో బుధవారం ఉదయం లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన తోడల్లుళ్లు మృతి చెందారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఈదమోని శ్రీశైలం(44), ఉరుకొండ మండలం రాచమల్ల గ్రామానికి చెందిన ఈరటు బచ్చయ్య(40)లు తోడల్లుళ్లు. ఇద్దరూ గేదెల క్రయ విక్రయాల వ్యాపారం చేస్తుంటారు. ఇద్దరు కలిసి మంగళవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా చింతపల్లి నుంచి బయలుదేరి నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రానికి చేరుకుని గేదెలను విక్రయించారు. బుధవారం తెల్లవారు జామున త్రిపురారం నుంచి బైక్‌పై బయలుదేరారు. దేవరకొండ పట్టణానికి చేరుకోగానే కొండమల్లేపల్లి నుంచి కల్వకుర్తి వైపు వెళుతోన్న ఐరన్‌లోడు లారీని ఓవర్‌టేక్ చేయబోయారు. ఈ క్రమంలో లారీ బైక్‌ను ఢీకొనడంతో ఈదమోని శ్రీశైలం లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈరటు బచ్చయ్యకు తీవ్ర గాయాలు కాగా దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీశైలం, బచ్చయ్య కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని దుఃఖసాగరంలో మునిగిపోయారు. శ్రీశైలం కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

గేదెలు బైక్‌ను ఢీకొని విద్యుత్ ఉద్యోగి

పాలకవీడు, మే 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం బెట్టితండాలో బైక్‌ను గేదెలు ఢీకొన్న ఘటనలో విద్యుత్ ఉద్యోగి మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాన్‌పహాడ్‌కు చెందిన షేక్ సైదులు అలియాస్ జాన్‌సైదా(42) విద్యుత్ శాఖలో లైన్‌మన్ కింద ఆర్టిజన్ ఉద్యోదిగా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 27న జాన్‌పహాడ్ గ్రామంలో వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లులను తీసుకుని మండలకేంద్రంలోని కార్యాలయంలో జమచేసి తిరిగి జాన్‌పహాడ్ గ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బెట్టిగూడెం వద్ద గేదెలు సైదులు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొన్నాయి. తీవ్ర గాయాలైన సైదులను అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సైదులు బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.



సైదులు(ఫైల్‌ఫొటో)

● ట్రాక్టర్ సహా బావిలో పడి డ్రైవర్...

ఆత్మకూరు(ఎస్), మే 28 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను వెనక్కు నడిపే క్రమంలో వాహనం సహా బావిలో పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం రామన్నగూడెం గ్రామ ఆవాసం గౌస్‌తండా సమీపంలో ఈ ఘటన జరిగింది. ఏఎస్ఐ జానకిరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎస్) మండలం బోరింగ్‌తండాకు చెందిన గుగులోతు రమేష్(38) నూతనకల్ మండలం గుండ్లసింగారం గ్రామానికి చెందిన బొగ్గు బట్టీ వ్యాపారి బండారు శ్రీను వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రామన్నగూడెం శివారు ఏరు సమీపంలోని చెట్ల మొద్దులను బొగ్గు బట్టీ వద్దకు తరలించేందుకు రమేష్ బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్‌తో వెళ్లాడు. మొద్దులు వేసేందుకు కూలీలు సిద్ధంకాగా, ట్రాక్టర్‌ను వెనక్కు నడిపే క్రమంలో రమేష్ ప్రమాదవశాత్తు సమీపంలోని బోర్రోజు మల్లయ్య వ్యవసాయ బావిలో ట్రాక్టర్‌తో పాటు పడిపోయాడు. బావిలో నీరు లోతుగా ఉన్నందున రమేష్ నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్రేన్, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో ట్రాక్టర్‌ను, రమేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జానకిరాములు తెలిపారు.



బావిలో పడిన ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది, డ్రైవర్ గుగులోతు రమేష్ (ఫైల్ ఫొటో)

లారీ కింద పడి బిహార్ కూలీ

శాలిగౌరారం, మే 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీ కింద పడి బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీ మృతి చెందాడు. ఎస్ఐ సైదులు తెలిపన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రంలోని సహస్ర జిల్లా బలుహా గ్రామ బైజ్‌నాథ్‌పట్టికి చెందిన సూరజ్ కుమార్(20) అదే ప్రాంతానికి చెందిన 11మందితో కలిసి చిత్తలూరులోని ఐకేపీ కేంద్రంలో హమాలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్నాడు. అదే సమయంలో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో వర్షానికి తడవకుండా నలుగురు హమాలీలు లారీ కిందికి వెళ్లారు.

లారీ డ్రైవర్ గమనించకుండా లారీని ముందుకు కదిలించాడు. గమనించిన లారీ కింద ఉన్న నలుగురు హమాలీల్లో ముగ్గురు బయటకు రాగా తప్పించుకునే క్రమంలో సూరజ్‌కుమార్ పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే విషయం తెలుసుకున్న శాలిగౌరారం పోలీసులు సూరజ్ కుమార్ మృతదేహాన్ని ఆటోలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం సూరజ్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సూరజ్‌కుమార్ మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

పెండ్లి పత్రికలు పంచి వస్తూ...

కనగల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి పత్రికలు పంచి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీ.చెన్నారం గ్రామస్టేజీ సమీపంలో నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన తౌడోజు వెంకటాచారి(50) నల్లగొండ పట్టణం శాంతినగర్‌లో నివాసముంటూ లాడ్జి మేనేజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా తన దగ్గరి బంధువు ఇంట్లో జరిగే పెళ్లి వేడుక ఆహ్వాన పత్రికలను పంచేందుకు దర్వేశిపురం వచ్చి తిరిగి నల్లగొండకు వెళ్తున్నాడు.

ఈ క్రమంలో మార్గమధ్యలోని జీ.చెన్నారం స్టేజీ వద్ద వెంకటాచారి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వెంకటాచారికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారని బంధువులు తెలిపారు. భార్య పారిజాతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నిద్రలో దడదడ

● రహదారిపై రంబుల్ స్ట్రిప్స్‌తో విపరీతమైన శబ్ధాలు

● కంటినిండా నిద్రలేక ప్రజల అవస్థలు




మునగాలలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఏర్పాటుచేసిన రంబుల్ స్ట్రిప్స్‌పై వెళ్తోన్న వాహనాలు

మునగాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : వేగ నియంత్రణతో పాటు డ్రైవర్ల నిద్రమత్తును వదిలించేలా రహదారులపై ఏర్పాటుచేసిన రంబుల్ స్ట్రిప్స్(కొద్దిపాటి మందంతో కూడిన పట్టి) సమీపంలోని ప్రజలకు నిద్రపట్టనివ్వడం లేదు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65వ నెంబరు)పై పెద్దసంఖ్యలో వాహనాల రాకపోకలు నిత్యం జరుగుతుంటాయి. ఈ క్రమంలో వాహనాలు నెమ్మదిగా, వన్‌వేగా వెళ్లాలనే ఉద్దేశంతో పోలీసులు స్టాప్‌బోర్డులను ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు తరుచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు హైవేపై మూడు లేయర్లుగా రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుచేశారు. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలోనూ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్‌పై వెళ్లే వాహనాలు చేసే దడ దడా శబ్దానికి సమీపంలోని నివాస ప్రజలకు రాత్రి పూట కంటినిండా నిద్రపట్టక నానా అవస్థలుపడుతున్నారు. ప్రతిరోజూ రాత్రి సమయంలో ఈ రంబుల్ స్ట్రిప్స్ సమీపంలో వాహనాల శబ్దాలతో పిల్లలు, చిన్నారులు నిద్రపోవడం లేదని స్థానికులు తెలిపారు. వేగ నియంత్రణకు గ్రామశివారులోనే ఈ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలంటున్నారు. ఊరులో మధ్యంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర మంతి గట్కరీ రంబుల్ స్ట్రిప్స్ తొలగించాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రంబుల్ స్ట్రిప్స్ తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని స్థానికులు తెలిపారు.

వాహనాల శబ్దంతో నిద్రలేక ఇబ్బందులు పడుతున్నాం

రంబుల్ స్ట్రిప్స్ వద్ద వాహనాల శబ్ధంతో రాత్రి పూట నిద్రపట్టటం లేదు. జన నివాసాల మధ్య స్ట్రిప్స్ ఏర్పాటు మంచిది కాదు. ఊరు శివారులో ఏర్పాటుచేయాలి. రోడ్డు వెంట ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులు శబ్ధాలు వినలేక ఇబ్బంది పడుతున్నారు. చిన్నపిల్లలు వణికిపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి తొలగించాలి.



కొప్పుల నర్సింహరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు

వాహనాలు, బైక్‌లు దెబ్బతింటున్నాయి

రంబుల్ స్ట్రిప్స్ సమీపంలో కార్లు, భారీ వాహనాలు, బైక్‌లు దెబ్బతింటున్నాయి. ఒక్క లేయర్ వేస్తే స్పీడ్ కంట్రోల్‌లోకి వస్తుంది.మూడు లేయర్లు వేయటం సరి కాదు. ఈ స్ట్రిప్స్ వల్ల వస్తున్న శబ్ధాలతో చెవులకు చిల్లులు పడే పరిస్థితి ఏర్పడింది. గ్రామం శివారులో ఏర్పాటు చేయాలి, అధికారులు పునరాలోచన చేసి వాటని తొలగించాలి.



బంగారపు సత్యం, మునగాల

అనాథ ఆశ్రమానికి పరుపుల వితరణ



చారుమతి చైల్డ్‌కేర్ ఆశ్రమానికి పరుపులు అందజేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

నల్లగొండ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రం శివారు పానగల్‌లోని చారుమతి చైల్డ్‌కేర్ ఆశ్రమంలో ఉన్న అనాథ పిల్లలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నీలగిరి బ్రాంచ్ తరఫున 20 మందికి బుధవారం పరుపులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. పుల్లారావు సీనియర్ ఐఎంఏ డాక్టర్ ఏవీ. శ్రీనివాసరావు, నీలగిరి బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ దామర యాదయ్య, నరేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మూగజీవికి ప్రాణం పోసి..

కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో గేదెకు అరుదైన శస్త్ర చికిత్స



గేదెకు శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

కోదాడ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో బుధవారం గేదెకు అరుదైన శస్త్ర చికిత్స జరిగింది. అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం ఆర్లెగూడెం గ్రామానికి చెందిన వెంకటరమణ పాడిగేదె ఆదివారం మేతకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కింది దవడ ఎముక విరిగి దంతాల ప్యాడ్ కూడా పెదవి నుంచి విడిపోయింది. గేదె నోటి ఎముక దంతాలు విరగడంతో మేత, నీరులేక రెండు రోజులుగా బాధపడుతోంది. చికిత్స నిమిత్తం గేదెను బుధవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చంద్రమోహన్, డెంటిస్ట్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావుల సహకారంతో దవడ గేదె ఎముకకు డ్రిల్లింగ్ చేసి స్టెయిన్‌లెస్ స్టీల్ వైరుతో దవడ ఎముకకి, పంటి పలుకకు కుట్లు వేసి మత్తుద్వారా గేదె ఏడు నెలల సూడికి నష్టం జరగకుండా కింది పెదవి ఎముకను, దంతాలను విజయవంతంగా అతికించారు. ఆపరేషన్ తర్వాత గేదె స్వతహాగా నీరు తాగడంతో పాటు ఆహారం తీసుకుంటుందని రైతు తెలిపారు. ఆపరేషన్‌కు కాపుగల్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సురేంద్ర, సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్ సహకరించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. యువకుడి మృతి

వేములపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): కారు డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శి వారులోని బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నామిరెడ్డి అరవింద్‌రెడ్డి(25) తన కారులో రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరాడు. శెట్టిపాలెం శివారులోని చిత్రపరక వాగు సమీపంలో కారు అదుపుతప్పి బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు పల్టీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అరవింద్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. అరవింద్‌రెడ్డి నామిరెడ్డి, పుల్లారెడ్డి సునీతల ఏకైక కుమారుడు. అరవింద్‌రెడ్డి బీబీఏ పూర్తి చేసి ఎంబీఏ కోసం సిద్ధమతున్నాడని తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పోచంపల్లిలో ఆఫ్రికన్ ప్రతినిధులు

● పోచంపల్లి టూరిజం సెంటర్‌ను సందర్శించిన 30మంది ప్రతినిధులు ● ఇక్కత్ డిజైన్లను పరిశీలించి అబ్బురపడిన యువతులు





భూదాన్‌పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్ వద్ద ఆఫ్రికన్ ప్రతినిధులు, రాట్నం తిప్పుతున్న ఆఫ్రికన్ యువతి

భూదాన్‌పోచంపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో ఆఫ్రికా ఖండంలోని 15దేశాలకు చెందిన 30మంది ప్రతినిధులు బుధవారం పర్యటించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఆఫ్రికా ఖండంలోని 15మధ్య పశ్చిమ ఆఫ్రికన్ దేశాల 30 మంది సోషల్ మీడియా, కంటెంట్ క్రియేటర్లు పోచంపల్లి పర్యాటక గ్రామాన్ని సందర్శించారు. స్థానిక సాంస్కృతిక కళలతో, మ్యూజిక్‌తో మమేకమయ్యారు. ప్రత్యేకమైన ఇక్కత్ చీరల తయారీ విధానాన్ని పర్యాటక మ్యూజియంలోని లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఇక్కత్ తయారీ విధానాన్ని పరిశీలించిన అతిథులు నూలు వడకడం నుంచి రంగులు చొప్పించే క్లిష్టమైన ప్రక్రియలను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. 'ఒక్క చీరకు వారం రోజులపాటు తీసుకునే శ్రమ, డిజైన్ల సృజనాత్మకత' వారి మనస్సును హత్తుకుంది. చీరలపై భిన్న డిజైన్లను గమనించిన అతిథుల్లో కొందరు స్వయంగా రాట్నంతో నూలు వడికే ప్రయత్నం చేశారు. అనంతరం వారు పోచంపల్లి ఇక్కత్ చీరల తయారీని పరిశీలించారు. భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ఆఫ్రికా ఖండంలోని దేశాల్లో చాటుతామన్నారు. మరికొందరు చీరలు కొనుగోలు చేశారు. అనంతరం వారు రామోజీ ఫిలింసిటీకి బయల్దేరి వెళ్లారు.

వస్త్ర పరిశ్రమను కాపాడుకోవాలి

ఎగుమతుల ప్రమోషన్ కార్యక్రమంతో పోచంపల్లి వస్త్ర పరిశ్రమ వారసత్వ నైపుణ్యాలను కాపాడుకోడంతోపాటు పారిశ్రామికుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ ఆధ్వర్యంలో జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్, టీజీటీపీసీ (తెలంగాణస్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్) సంయుక్తంగా ఎంఎస్ఎంఈల(టెక్స్‌టైల్ రంగంలోని) అంతర్జాతీయ ఎగుమతులు పెంపొందించేందుకు ఆర్ఏఎంపీ కార్యక్రమం నిర్వహించారు. రైజింగ్ యాక్సెసరీ అండ్ ఎంఎస్ఎంఈ ప్రోగ్రాం - ఆర్ఏఎంపీ పథకాన్ని భారత ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ సహకారంతో ప్రారంభించింది. జీఐ ట్యాగ్ కలిగిన పోచంపల్లి ఇక్కత్ టెక్నాలజీని, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తేవడం ద్వారా ప్రాంతీయ ప్రజలు సమూహంగా, సమష్టిగా ప్రయోజనాన్ని పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో భారత లవకుమార్, ఫారిన్ ట్రేడ్ డెవలప్‌మెంట్ రిటైర్డ్ ఆఫీసర్ పీఎస్‌బీ శాస్త్రి, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, జంగయ్య, అంతర్జాతీయ ఎగుమతుల ఎక్స్‌పర్ట్ శ్రీదేవి, శివకుమార్, బాలకృష్ణ, జగదీష్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో దీపిక పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం.. దక్షిణాది మూలాలు పదిలం!



యోవానీనాయుడు అనే యువతి కంటెంట్ క్రియేటర్‌గా దక్షిణాఫ్రికా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారత దేశ పర్యటనలో భాగంగా హైదారాబాద్‌కు చేరుకున్నారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఆఫ్రికా ఖండంలోని 15 దేశాలకు చెందిన 30మంది భారత దేశ పర్యటనలో ఆమె మార్గదర్శనం చేశారు. నాలుగు రోజుల క్రితం వారితో హైదరాబాద్‌కు చేరుకున్నారు. యోవానీ నాయుడు పేరులోనే కాదు.. ముఖ కవళికల్లో అచ్చు తెలుగుదనం, భారతీయత ఉట్టిపడుతోంది. తండ్రి తెలుగు వ్యక్తి కాగా, తల్లిది తమిళనాడు. వారి పూర్వీకులు శతాబ్దాల క్రితం దక్షిణాఫ్రికా వలస వెళ్లారు. దక్షిణాఫ్రికాలోని డర్బన్ నివాసి. తాను ఆరో తరానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తెలుగు, తమిళనాడు భాషలు రాకున్నా.. సంస్కృతి, సంప్రదాయాలకు దూరం కాలేదు. కట్టు, బొట్టు, సంప్రదాయ దుస్తుల్లో ఉంటూ.. స్థానిక భారతీయురాలిలాగే కనిపిస్తుంది యోవానీ నాయుడు. ఆమె సైంటిస్టుగా పనిచేస్తున్న వెస్టర్న్, ట్రెడిషన్ సంగీతాన్ని మేళవిస్తూ మ్యూజిక్, కల్చర్, లాంగ్వేజెను ప్రమోటింగ్ చేస్తుంది. తెలుగు పాటలు చక్కగా పాడే ఆమె టాలీవుడ్, కోలీవుడ్‌లకు గ్రేట్ ఫ్యాన్ అంటూ దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించడం తనకు గర్వంగా ఉందన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 28(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభూవులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.30,83,173 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. మధుసూదన్‌రావు దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా వేర్వేరుగా యాదగిరిగుట్టకు వచ్చారు. గర్భాలయంలోని స్వయంభూవులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వారికి స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేశారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామి నిత్య కల్యాణాన్ని వేద పండితులు నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ తలంబ్రాలుతో నిత్య కల్యాణం నిర్వహించారు. నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, ఆలయ అర్చకులు తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహామూర్తి,సీతరామశాస్త్రీ, శేషగిరిరావు, రాజష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చింతపల్లి ఆలయ వార్షికోత్సవాలు

చింతపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): సాయినాథుడి అనుగ్రహం పొందాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో 18వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఆలయంలో 300 గోవులను పెంచి ధర్మసంస్థాపనకు ట్రస్టు చైర్మన్, సభ్యుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి, టీవీఎన్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, ఎల్లంకి అశోక్, బాదేపల్లి నిరంజన్‌గౌడ్, వందనపు అంజనేయులు, ఎండి.ఖలేద్, సీమర్ల శ్రీను పాల్గొన్నారు. ముక్కామల పీఠాధిపతి శ్రీధర్ స్వామి, చండీఉపాసకుడు కొడకండ్ల రామచరణ్‌శర్మ, శానగొండ శివకిరణ్‌శర్మ ఆధ్వర్యంలో వాస్తు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కొమిరిశెట్టి వెంకటయ్య, వూరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి: షిర్డీసాయిబాబా ఆలయ పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర

నాగార్జునసాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	512.60
టీఎంసీలు	136.1274
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	5.598
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	96.324
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	6.498 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	25.43 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	638.50 అడుగులు
టీఎంసీలు	2.88
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	1812. 14 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	91.35 క్యూసెక్కులు

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం



శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీనది

నల్లగొండ, శాలిగౌరారం, కేతేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. నల్లగొండ జిల్లా గుండపల్లి మండలం సింగరాజుపల్లిలో అత్యధికంగా 2.2 సెంటీమీటర్లు, అత్యల్పంగా చందంపేటలో 0.8మిల్లీమీటర్లు, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో 1.3 మిల్లీమీటర్లు, యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లిలో 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజుల నుంచి వస్తున్న వరదకు మూసీ నది ఉధృతంగా ప్రవహించడంతో జలకళ సంతరించుకుంది. నది పరివాహక గ్రామాలైన ఉప్పలంచ, మునిమద్దె, గురజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి వద్ద బాగా మూసీనది ప్రవహిస్తోంది.

639 అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం

అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎగువ నదీ పరీవాహక ప్రాంతాలు హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ దిశగా పయనిస్తోంది. నెల రోజులకు పైగా ఐదారు వందల క్యూసెక్కులుగా నిలకడగా ఉంటున్న ఇన్‌ఫ్లో బుధవారం 1812 క్యూసెక్కులుగా నమోదైంది. మంగళ, బుధవారాల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలతో పాటు ఎగువ మూసీ పరివాహక గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు క్రమంగా దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 639అడుగులకు (2.89టీఎంసీలు)చేరింది. వేసవిలోనే ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటుండడంతో ఆయకట్టు గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణికి రుతుపవనాలు తోడవడంతో వచ్చే నాలుగైదు రోజులు వర్షాలు కురిసే వీలుందని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో జూన్ తొలివారంలోనే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరే వీలు ఉందని రైతులు చర్చించుకుంటున్నారు.

ఎల్లమ్మతల్లీ.. దీవించు



ఎల్లమ్మ తల్లి ద్వారానికి భక్తులు కట్టిన తొట్టెల ముడుపులు

ఆ తల్లిని వేడుకుంటే కోర్కెలు తీరినట్టే.. తొట్టెల ముడుపు కడితే 'కడుపు' పండినట్టే..! ఇదీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం గుట్టపైన వెలసిన (బావని) ఎల్లమ్మ దేవత పట్ల మహిళలకు ఉన్న విశ్వాసం. అందుకే కొత్తగా నవ దంపతులు లేదా పెళ్లి అయి ఏళ్ల గడిచినా సంతాన భాగ్యానికి నోచని దంపతులు చెర్వుగట్టు క్షేత్రానికి వచ్చి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్నారు. 'అమ్మా'..అనే పిలుపు కోసం ఆరాటపడుతున్నారు. మాతృత్వపు వరాన్ని కోరుతూ 'తొట్టెల'ను ముడుపుగా కడుతున్నారు. కడుపు పండించమని తల్లిని మొక్కుకుంటున్నారు.

● (ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి)

ఎంజీయూ డిగ్రీ బ్యాక్ లాగ్ ఫలితాల విడుదల

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సంవత్సరం విధానంలో డిగ్రీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు చిట్టచివరి సారి అవకాశం కల్పించి మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు సీవోఈ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గడ్డిపల్లి పాలిటెక్నిక్ ఇన్ హార్టికల్చర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఘంటా సత్యనారాయణరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి హార్టికల్చర్ ఇన్ పాలిటెక్నిక్ కళాశాలలో హార్టికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం సమత కంపెనీ ఆధ్వర్యంలో హార్టికల్చర్ కార్యదర్శి స్నేహలత పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు, సోము బాల చౌడరెడ్డి, జోనల్ హెడ్ ఎం. సాయి, రీజినల్ మార్కెటింగ్, మేనేజర్ కళాశాల ఇన్‌చార్జి సీహెచ్. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చిన కాలం.. మొలకెత్తిన విత్తనం

● సిద్ధం చేసిన దుక్కుల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతులు

మోత్కూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఒకట్రెండు వర్షాలకు విత్తనాలు విత్తరు. ఒక వేళ విత్తితే ఎండలకు విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే వట్టిపోతాయి. కాని సారి కత్తెర చివరి పాదం నుంచి రోహిణిలో కూడా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మే నెలలో కురిసిన వర్షాలకు పలువురు రైతులు మెట్ట పంటల సాగుకు దుక్కులు దున్ని సిద్ధం చేసి పెట్టుకున్నారు. కత్తెర కార్తెలో ఈ నెల 21న వర్షం కురియడంతో యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో దుక్కులు సిద్ధం చేసి పెట్టుకున్న రైతుల్లో కొందరు ధైర్యం చేసి ఈ నెల 22న పత్తి విత్తనాలు విత్తారు. ఈ నెల 25నుంచి రోహిణి కార్తె ప్రారంభమైంది. రోహిణిలోనూ వర్షాలు కురుస్తుండడంతో కత్తెర కార్తె చివరి పాదంలో విత్తిన పత్తి విత్తనాలు శ్రేష్టంగా మొలకెత్తాయి. రోహిణిలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఇప్పటికి దుక్కులు సిద్ధం చేయని రైతులు ఈ వర్షాలకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. ముందుగా విత్తనాలు విత్తడం వల్ల నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు లేకపోయినా అప్పటికే పత్తి దిగుబడి చేతికి వస్తుందని, నష్టం జరగదని రైతులు చెబుతున్నారు. ఒక వేళ నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు కురిస్తే తమకు రెండో పంట కూడా వస్తుందని చెబుతున్నారు. ఇప్పుడు వర్షాలు కురియడం లాభదాయకంగానే ఉంటుందంటున్నారు. ఈ వర్షాలకు బలమైన కార్తెలో విత్తనాలు విత్తడంతో పాటు, గొర్రెలు, పశువులకు త్వరగా పచ్చగడ్డి దొరుకుందని, వానాకాలం వరి పంటకు ఈ కార్తెలోనే నార్లు కూడా పోసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు ముందుగా కురిసిన వర్షాలు ఆ తర్వాత ముఖం చాటేస్తే మాత్రం నష్టం జరుగుతుందని పేర్కొంటున్నారు రైతులు.



మోత్కూరులో మొలకెత్తిన పత్తి విత్తనాలు

పత్తి విత్తనాలు శ్రేష్టంగా మొలకెత్తాయి



బలమైన కార్తె అన్న భావనతో ఈ నెల 21న కురిసిన వర్షానికి నేను పది ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తాను. నేను విత్తనాలు విత్తిన తర్వాత కూడా వర్షాలు కురియడంతో పత్తి విత్తనాలు శ్రేష్టంగా మొలకెత్తాయి. రోహిణి కార్తెలో కురుస్తున్న వర్షాలకు చాలామంది రైతులు విత్తనాలు విత్తుతున్నారు. నేను ధైర్యం చేసి ముందుగా విత్తనాలు విత్తినందుకు వర్షాలు కురవడం కలిసొచ్చింది.

● మర్రి మధు, పత్తిరైతు, మోత్కూరు.

మాదిగలకు మరో మంత్రి పదవి ఇవ్వాలి

నార్కట్‌పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో చేయనున్న కేబినెట్ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి మరొక మంత్రి పదవిని కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి నర్సింహ, జిల్లా అధ్యక్షుడు గద్దపాటి సైదులు డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చింత సైదులు, పెండ్యాల శంకర్, చింత యాదయ్య, నాగరాజు, పెండ్యాల కృష్ణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఓయూ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా చిట్యాల వాసి శ్రీనివాస్



చిట్యాలరూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన మేడి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సోదరులు వెంకటేష్, రమేష్ బుధవారం ఆయన్ను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాభినందనలు తెలిపారు. భవిష్యత్తులో అత్యున్నత పదవులను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

సమాచారం

దరా ముతావలీ మృతికి సంతాపం

నల్లగొండ కల్చరల్, మే 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జమాల్‌ఖాద్రీ తండ్రి లతీఫ్ సాహెబ్ దర్గా ముతావలీ రషీద్ ఆలీ మృతికి జడ్పీ జిల్లా మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన నివాసంలో రషీద్ అలీ మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట మాలే శరణ్యరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బక్క పిచ్చయ్య, రాంమోహన్, కొండూరు సత్యనారాయణ, మారగోని గణేష్, మెరుగు గోపి, యుగేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, సందీప్ రెడ్డి, దయాకర్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నార్కట్‌పల్లి, మే28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు గ్రామానికి చెందిన దండ లింగారెడ్డికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.38వేల ఆర్థిక సాయం చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సింహారెడ్డి, వారాల రమేష్, గడుసు శశిధర్‌రెడ్డి, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

శాలిగౌరారం, మే 28 (ఆంధ్రజ్యోతి): తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు అకాలంగా మరణించడంతో అతని మిత్రులు కుటుంబానికి అండగా నిలిచారు. శాలిగౌరారం మండలం మనిమిద్దె గ్రామానికి చెందిన కొండ్రాసి పున్నమయ్య అకస్మాత్తుగా మృతి చెందాడు. దీంతో అతనితో కలిసి చదువుకున్న 10వ తరగతి స్నేహితులు పున్నమయ్య భార్య పిల్లలకు రూ.20 వేల ఆర్థికసాయంతో పాటు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు కోటగిరి రమేష్, దాసరి సత్యనారాయణ, వేముల రమేష్, రాచకొండ గణేష్ తదితర మిత్రులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ

నార్కట్‌పల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని తాజా మాజీ సర్పంచ్ గంట్ల నర్సిరెడ్డి కుటుంబాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం పరామర్శించారు. నర్సిరెడ్డి మృతికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారివెంట నాయకులు మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకన్న, రఘుపతిరెడ్డి, శ్రవణ్ ఉన్నారు.


మంద కృష్ణకు పద్మశ్రీ మాదిగజాతికి గర్వకారణం

శాలిగౌరారం, చిట్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇవ్వడం ఎంతో గర్వకారణమని తెలంగాణ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరకొండ మస్తాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల దేవదాస్ అన్నారు. బుధవారం వారు శాలిగౌరారం, చిట్యాలలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. పద్మశ్రీ అవార్డు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

31న కాటమేశ్వర కల్యాణం

గట్టుప్పల్, మే 28 (ఆంధ్రజ్యోతి): గట్టుప్పల్ మండల కేంద్రంలో ఈనెల 31న శ్రీ కాటమహేశ్వర స్వామి - సూరమాంబ అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు బండారు చంద్రయ్య తెలిపారు.

నీలగిరి అభివృద్ధికి యాక్షన్ ప్లాన్



నల్లగొండ పట్టణం

- వంద రోజుల కార్యాచరణ
- ప్రణాళికను రూపొందించిన ప్రభుత్వం
- జూన్ 2 నుంచి పనులు ప్రారంభం

నీలగిరి పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నీలగిరిలో సాగుతున్న అభివృద్ధి పనులు మరింత వేగవంతమయ్యేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ఈ యాక్షన్ ప్లాన్ అమృత్ మిత్ర ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి వంద రోజుల పాటు నిర్వహించాలని మునిసిపల్ అధికారులకు ఆదేశాలను జారీ చేసింది. రోజువారీ పనులు నిర్వహిస్తూనే ఈ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వంద రోజుల్లో పట్టణంలోని పారిశుధ్య, పార్కులు, ఆస్తిపన్ను, మంచినీటి కనెక్షన్ సమస్యలను గుర్తించి వాటిని ఈ వంద రోజుల్లోనే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

- రామగిరి, ఆంధ్రజ్యోతి

కార్యాచరణ పనులివీ....

- వరద కాల్వలల్లో పూడికతీత పనుల టెండర్ల ప్రక్రియ
- ఐఈసీ ఏజెన్సీల ముగింపు, రోజువారీ కార్యకలాపాల సన్నాహాలు
- మొక్కలను నాటడానికి స్థలాలను గుర్తించడం
- మొక్కల సేకరణ, నర్సరీలో నిల్వలపై పరిశీలన
- భువన్ సర్వే కోసం వార్డుల వారీగా అధికారుల నియామకం
- ఆస్తి పన్ను డేటాను వేరు చేయడం
- మంచినీటి కుళాయి కనెక్షన్ల నవీకరణ
- ఆస్తుల మార్పిడికి సంబంధించిన ధ్రువ పత్రాల సేకరణ
- వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహణకు సంబంధిత వైద్యులతో సంప్రదింపులు చేయడం
- పార్కులను మరింత అభివృద్ధి చేసేందుకు టెండర్లను పిలవడం
- విభాగాలకు అప్పగించబడిన పనులకు సంబంధించి ఉద్యోగులకు అంతర్గత సర్క్యులర్‌లను జారీ చేయడం
- రోజువారీ పర్యవేక్షణ, నివేదికల కోసం వార్డుల వారీగా అధికారులను నియమించడం
- వంద రోజుల కార్యచరణ ప్రణాళికకు అనుగుణంగా రోజువారీ, వారాంతపు కార్యాచరణ క్యాలెండర్‌ను రూపొందించడం
- స్వచ్ఛతపై ఇంటింటి ప్రచారాలు నిర్వహించడం, దానికి అవసరమయ్యే వాహనాలు, సిబ్బంది, సామగ్రి సమకూర్చుకోవడం
- వీధి వ్యాపారుల తాత్కాలిక కమిటీల ఏర్పాటుకు పరిశీలన, వ్యాపార సముదాయం గుర్తించడం
- కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు చర్యలు
- ఇందిరా,మహిళా శక్తి మిషన్ కింద అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు రుణాలను ఇప్పించేందుకు ప్రణాళికలను రూపొందించడం
- ఇందిరా, మహిళా శక్తి క్యాంటిన్ల ప్రారంభానికి కార్యాచరణ ప్రణాళికకు ఏర్పాటు చేయడం
- ప్రతీ శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించేందుకు తగు ప్రణాళికలు.

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తాం

నల్లగొండ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం కార్యాచరణను అమలు చేస్తాం. ఈ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వార్డు ఆఫీసర్లకు కూడా శిక్షణ ఇస్తాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

నవగ్రహాల ప్రతిష్ఠ పూజలు

నార్కట్‌పల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాపల్లి కమలాద్రి లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా బుధవారం గణపతి పూజలో ఉత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ అనవంశిక అర్చకుడు కారంపూడి నర్సింహచార్యుల యాజ్ఞీకంలో మొదలైన ఉత్సవ పూజల్లో భాగంగా పుణ్యహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, నవగ్రహ విగ్రహాలకు శాస్త్ర ప్రకారం జలాధివాసం నిర్వహించారు.

యోగా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చిట్యాల, మే28, (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా మాసోత్సవాల సందర్భంగా ఆయూష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను బుధవారం చిట్యాలలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ఆరోగ్యానికి మంచిదని, అందరూ యోగా మాసోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాన్ని ఎత్తివేసే కుట్ర : వ్యకాస



సమావేశంలో మాట్లాడుతున్న నారీ అయిలయ్య

చిట్యాల, మే 28(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల ఐక్య పోరాటాలతో సాధించుకున్న ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేయడానికి కేంద్రప్రభుత్వం కుట్ర చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ అయిలయ్య ఆరోపించారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన సమావేశంతో ఆయన మాట్లాడారు. క్రమంగా నిధులు తగ్గిస్తూ, కూలీలకు పనిముట్లు ఇవ్వకుండా ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించడం లేదని, కూలి సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి, కల్లూరు కుమారస్వామి, గుడిసె లక్ష్మీనారాయణ, మెట్టు పరమేశం, రాములు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు కార్మికులు తరలిరావాలి

కేతేపల్లి: కేంద్రప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని వ్యకాస జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు కోరారు. మండలకేంద్రం కేతేపల్లిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ధర్నా పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు ఉద్యమించి ఉపాధి చట్టాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు వి. వెంకన్న, ఎ.నాగయ్య, టి.డానియేలు, బి. ప్రవర్దన్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేటు కళాశాలలను రద్దు చేయాలి



నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని ప్రైవేట్ కళాశాలలను రద్దు చేయాలని, ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు సిండికేట్‌గా మారి ఒక్కో విద్యార్థి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తు న్నారని అన్నారు. నిరుపేద విద్యార్థులు విద్యను దూరమయ్యే విధంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు దుబ్బాక రామకృష్ణయాదవ్, కొల్లరి నగేష్, లింగయ్య. కుమార్, శివశంకర్, అంజి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో భూమి సారవంతం

మునుగోడు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి చేస్తే భూమి సారవంతం అవుతుందని, పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి మారగోని నరసింహగౌడ్ అన్నారు. మండలంలోని కల్వలపల్లి గ్రామంలో బుధవారం రైతులకు పంట మార్పిడి విధానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పత్తి విత్తనాలు కొనే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భూమి ఉన్న ప్రతీ రైతు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు రైతు ఆధార్‌కార్డు నెంబర్‌తో పాటు ఆధార్ లింకు ఉన్న ఫోన్ నెంబర్‌ను వ్యవసాయ విస్తరణ అధికారి వద్దకు తీసుకువచ్చి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి



చిట్యాల రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చిట్యాల మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలంలోని రైస్‌మిల్లర్లు మండలంలోని వట్టిమర్తిలో బుధవారం మార్కెట్ చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం స్వగ్రామంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధిలో రైస్‌మిల్లర్లు భాగస్వాములుగా ఉన్నారని, వారికి ఎలాంటి సమస్యలు వచ్చినా ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పందిరి శ్రీనివాసులు, నాయకులు వనపర్తి వెంకటేశ్వర్లు, వేలుపల్లి శంకరయ్య, పోలా యాదగిరి, వేలుపల్లి రమేష్‌కుమార్, పందిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

కనగల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి-సురమాంబదేవి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. మహిళలు నీళ్లారబోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. వేడుకల్లో భాగంగా సుమారు వంద మంది భక్తులు స్వామి వారి మాలధారణ చేశారు. ఈ నెల 31న ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్ల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుదారులు వచ్చే జూన్ నెలలో రేషన్ బియ్యం తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలో 2754 లబ్ధిదారులకు తెల్లరేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ప్రజాపాలన, ఆన్‌లైన్‌లో మండలంలో 3984 మంది తెల్లరేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా పరిశీలించి జిల్లా అధికారులు వాటిలో 2754మంది లబ్ధిదారులను గుర్తించి కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.

రెండు అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలి

చిట్యాల, మే28, (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిధిలో మరో రెండు అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరరావుకు బీజేపీ నాయకులు మాస శ్రీనివాస్, లింగస్వామి వినతిపత్రం అందజేశారు.

చలో వరంగల్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డుతో ఈ నెల 31న వరంగల్‌కు తిరిగి వస్తున్న మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలకడానికి మాదిగ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగలు అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పోరాటం వల్లే తరతరాలుగా అంటరానితనానికి, అవమానాలకు, సమాజ ఆదరణకు దూరమైన మాదిగజాతి ఇప్పుడిప్పుడే గుర్తింపు పొంది హక్కులను సాధించుకుంటుందన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లపాక వెంకన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ లం కపల్లి నగేష్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుపాటి కమలమ్మ, నాయకులు మాచర్ల సుదర్శన్, మల్లయ్య, ప్రసాద్, హరి, ఏడుకొండలు, వెంకన్న, జలంధర్, సైదు లు, వెంకన్న, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

యోగా వేడుకలను విజయవంతం చేయాలి

కట్టంగూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27 నుంచి జూన్ 21 వరకు నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలను విజయవంతం చేయాలని ఆయుష్మాన్ వైద్యాధికారి డాక్టర్ ఉర్మిల పిలుపునిచ్చారు. మండలంలోని అయిటిపాములలోని పల్లె దవాఖానా ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టులు ఉమారాణి, సైదులు, యోగా ఇన్‌స్ట్రక్టర్స్ షరత్, నిర్మల, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మర్రిగూడ, మే 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నల్ల యాదయ్యగౌడ్ అన్నారు. మర్రిగూడలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మర్రిగూడలో మొదటి విడతగా 200మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని అన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసి ఇంటిని నిర్మించుకునే విధంగా చూడాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల జాబితాను విడుదల చేయాలి ఆయన కోరారు.

బిల్లు తీసుకోవాలి

(5వ పేజీ తరువాయి)

వల్ల లద్దె పురుగులతో పాటు శనగపచ్చ పురుగును కూడా నివారించవచ్చు. జూన్ మొదటి, రెండో వారంలో మంచి వర్షాలు కురిసిన తరువాత విత్తనాలను వేసుకోవచ్చు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతుల బిల్లు తప్పనిసరిగా పొంది సీజన్ పూర్తయ్యే వరకు అందుబాటులో ఉంచుకోవాలి. ఎవరైనా డీలర్లు బిల్లు ఇవ్వకపోతే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. బిల్లు ఇవ్వని డీలర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు విక్రయాలను నిలిపివేస్తాం.

రైతు: గులాబీ రంగు తెగులు రాకుండా పత్తి విత్తనాలు ఉన్నాయా? బంగారు రవి, మునుగోడు

జేడీఏ: బీటీ-1తో పాటు బీటీ-2 రకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విత్తనాల వల్ల గులాబీ రంగు తెగులు రాకుండా ఉంటుం ది. పంటల మార్పిడి వల్ల అధిక దిగుబడి వస్తుంది. పత్తి విత్తనాలను నాణ్యమైనవి కొనుగోలు చేయాలి. పంటమార్పిడి వల్ల కూడా దిగుబడి అధికంగా వస్తుంది. ప్రస్తుతం 120రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. విత్తనాలకు బిల్లులు తప్పనిసరిగా పొందాలి. పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి సపోర్టు ఉంటుంది.

రైతు: భూదార్ కార్డు ఇవ్వడానికి అధికారులు ఏర్పా ట్లు చేశారా? నాగరాజు, అనంతారం, నల్లగొండ

జేడీఏ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ప్రతీ రైతుకు ఇవ్వడం జరుగుతుంది. అందు లో భాగంగా ఆధార్ మాదిరిగానే భూదార్ కార్డును ఇస్తున్నాం. ఇప్పటి వరకు 40వేల మంది నమోదు చేసుకోగా 11వేల కార్డులు వచ్చాయి. ఇకపోతే సన్నరకం ధా న్యానికి సంబంధించి రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుంది. గత వానాకాలం సీజన్‌లో రూ.37 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసింది.

రైతు: యాంత్రీకరణ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారు? భిక్షమాచారి, మిర్యాలగూడ, నవీన్‌రెడ్డి, తిప్పర్తి

జేడీఏ: ప్రభుత్వం ఇప్పటికే యాంత్రీకరణ పథకానికి నిధులు కేటాయించింది. దరఖాస్తులు కూడా తీసుకున్నాం. యాంత్రీకరణ పథకాన్ని త్వరలోనే అమలుచేస్తాం. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

రైతు: అధిక దిగుబడికి ఎలాంటి పంటలు వేయాలి? గుండెబోయిన మల్లేష్, చిన్న నారాయణపురం

జేడీఏ: పంటలు అధిక దిగుబడి రావాలంటే విత్తనాల ఎంపికను చేసుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. అధిక పంటల దిగుబడికి పంటల మార్పిడితో పాటు కందులు కూడా వేయవచ్చు.

రైతు: రాయితీపై ఏ విత్తనాలు ఇస్తున్నారు? నాగరాజు, బుద్దారం

జేడీఏ: భూసారం పెంచడం కోసం జీలుగ విత్తనాలను ఇస్తు న్నాం. అధిక దిగుబడుల కోసం రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దకు మాత్రమే రైతులు వెళ్లాలి.

రైతు: పత్తి దిగుబడి రావడం లేదు? శేఖర్‌రెడ్డి, బుద్ధారం, నల్లగొండ

జేడీఏ: పత్తి అధిక దిగుబడి రావాలంటే తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలి. దీనివల్ల దిగుబడి పెరుగుతుంది. కంది పంటను కూడా వేసుకోవచ్చు.

రైతు: సన్న రకాలకు సంబంధించి ఏ విత్తనాలు వాడాలి? శేఖర్‌రెడ్డి, అన్నెపర్తి

జేడీఏ: సన్నరకాలకు సంబంధించి అనేక రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అధీకృత డీలర్ల వద్ద నాణ్యమైన రకాల విత్తనాలను కొనుగోలు చేయాలి. అదేవిధంగా పత్తి విత్తనాలకు సంబంధించి బీటీ-2 రకాలు అందుబాటులో ఉన్నాయి.

రైతు: సన్నరకానికి బోనస్ చెల్లిస్తారా? లచ్చయ్య, గొల్లగూడెం

జేడీఏ: ప్రభుత్వం సన్నరకాలకు సంబంధించి క్వింటాల్ రూ.500 బోనస్ చెల్లిస్తుంది. 120 రోజులల్లో వచ్చే సన్నరకాలు అందుబాటులో ఉన్నాయి. మంచి దిగుబడి కూడా వస్తుంది.

రైతు: విత్తనాలు వెదజల్లే విధానంతో ప్రయోజనం ఏ మేరకు ఉంటుంది? హుస్సేన్, డిండి

జేడీఏ: విత్తనాలు వెదజల్లే పద్ధతి వల్ల డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుంది. కూలీల ఖర్చు కూ డా తగ్గుతుంది. పత్తి, సన్నరకాల ధాన్యానికి సంబంధించి అధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేయాలి. పత్తి ప్యాకెట్ ధర రూ.901 ఉంది.

రైతు: సన్నరకాలు పండిస్తున్నాం. బోనస్ తప్పనిసరిగా వస్తుందా? బస్వ సత్యనారాయణ, తానేదార్‌పల్లి, వెంకట్‌రెడ్డి, తిప్పలమ్మగూడెం, కోటిరెడ్డి, తిప్పర్తి

జేడీఏ: సన్నరకం పండించే ధాన్యానికి సంబంధించి బోనస్ రూ.500 తప్పనిసరిగా వస్తుంది. సన్నరకాలు పండించే రైతుకు ప్రోత్సాహం ఉంటుంది. నచ్చిన సన్నరకాలను రైతులు కొనుగోలు చేయాలి. అదేవిధంగా 40 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

రైతు: ఇప్పటి వరకు రైతుభరోసా వేయలేదు? వెంకటయ్య, కొండమల్లేపల్లి

జేడీఏ: మీకు ఒక ఎకరం నాలుగు గుంటలు ఉందని చెప్పారు. నాలుగు ఎకరాల వరకు ఇప్పటికే రైతుభరోసా నిధులు పడ్డాయి. సాంకేతిక కారణాల వల్ల ఆగిపోవచ్చు. స్థానిక ఏఈవోను సంప్రదించాలి. ఎందుకు రాలేదనే దానిపై సమాధానం ఇస్తారు. తప్పనిసరిగా ప్రతీ రైతుకు రైతు భరోసా నిధులు వస్తాయి.



ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ శ్రవణ్ కుమార్, అధికారులు

వార్డెన్ల కొరత తీరింది

(5వ పేజీ తరువాయి)

సమస్యల వలయంలో మగ్గాయి. చాలావరకు సొంతభవనాలు శిథిలావస్థకు చేరాయి. పూర్తిగా సౌకర్యాల లేమితో కొనసాగుతున్నాయి. విద్యార్థులు అవస్థల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు. మురుగుదొడ్లకు నీటి వసతి లేదు. కొన్ని వసతి గృహాల్లోని గదులు పెచ్చులూడుతున్నాయి. కిటికీలకు తలుపులు లేవు. వీటి పరిష్కారానికి ప్రభుత్వం నిధులు అందించాలని అధికారులు కోరుతున్నారు. సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి జిల్లాలో 59 వసతిగృహాలు ఉండగా, అందులో 23 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించి 2023 నుంచి సుమారు రూ.18లక్షలకు పైగా అద్దె చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో 17 నెలలుగా అవి పెండింగ్‌లో ఉన్నాయి. బీసీ వసతిగృహాలకు సుమారు రెండేళ్లకు రూ.2.88కోట్లు ప్రభుత్వం అద్దెగా చెల్లించాల్సి ఉంది. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి మొత్తం 27 వసతిగృహాలు ఉండగా, అందులో 8అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటికి కూడా ప్రభుత్వం రెండేళ్లుగా సుమారు రూ.18 లక్షలకు పైగా అద్దె పెండింగ్‌లో ఉంది. దీంతో అద్దె భవనాల స్థానంలో పక్కా భవనాలు ని ర్మించాలని అటు విద్యార్థి సంఘాలతో పాటు వసతి గృహ విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 29 మే 2025



డిగ్రీ బ్యాక్ లాగ్ ఫలితాల విడుదల

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం 7

తోడల్లుళ్లను బలిగొన్న ఓవర్‌టేక్ 6

వార్డెన్ల కొరత తీరింది





▸ అన్ని హాస్టళ్లకూ నియామకం ▸ పెరగనున్న పర్యవేక్షణ ▸ హాస్టళ్లకు పక్కాభవనాలు నియమించాలనే డిమాండ్

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇంతకాలం ఇన్‌చార్జీల పాలనతో సతమతమైన వసతి గృహ విద్యార్థులకు ఇకపై మంచి రోజులు రానున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు వార్డెన్ల కొరతతో సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. ఒక్కొక్కరికీ రెండు, మూడు వసతి గృహాల బాధ్యతలు ఉండటంతో సరైన నిర్వహణ లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ వార్డెన్ పోస్టుల భర్తీ, నియామక ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ పోటీ పరీక్షకు సంబంధించి ఇటీవల ఫలితాలు రావడం, అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం వంటివి చకచకా జరిగాయి. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న సంక్షేమ వసతిగృహ అధికారుల పోస్టులను నూతనంగా నియమకమైన వారికి కేటాయించారు. వారికి వృత్యంతర శిక్షణ సైతం నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. దీంతో ఇంతకాలం ఇన్‌చార్జీలతో నడిచిన వసతిగృహాలకు ఈ విద్యాసంవత్సరం నుంచి వసతి గృహ నూతన అధికారులు రానున్నారు.

ఇకనైనా సమస్యలు పరిష్కారమయ్యేనా?

జిల్లాలో పూర్తిస్థాయి వార్డన్లు లేకపోవడంతో పలు ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలు ఇన్‌చార్జీల పాలనలో కొనసాగాయి. దీంతో వసతి గృహాల నిర్వాహణ నామమాత్రంగా కొనసాగింది. సరైన పరిశుభ్రత లేకపోవడం, మెనూ అమలులో ఫిర్యాదులు వంటివి తరచూ అధికారుల దృష్టికి వచ్చాయి. అయినా వార్డెన్ల కొరత కారణాలతో పెద్దగా ఫలితం లేకుండా పోయేది. భవనాల కప్పులు పెచ్చులూడుతున్నా, మరుగుదొడ్లు, స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రస్తుతం ఒక్కో వసతి గృహానికి ఒక్కో వార్డెన్ రావడంతో సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థులు భావిస్తున్నారు.

అద్దెభవనాలతో అవస్థలు

జిల్లాలోని చాలా వసతి గృహాలకు పక్కా భవనాల అవసరం ఉంది. అద్దె భవనాల్లో వసతులు లేక మిగతా 8వ పేజీలో...

జిల్లాలో ఇది పరిస్థితి

జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన మొత్తం 59 వసతి గృహాలు ఉన్నాయి. అందులో ప్రీమెట్రిక్ హాస్టళ్లు 44, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 15 ఉన్నాయి. వీటిలో సుమారు 4,606 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న 59 వసతి గృహాలకు ఇంతకాలం కేవలం 28 మంది రెగ్యులర్ వార్డెన్లు మాత్రమే ఉన్నారు. మిగతా వసతిగృహాలన్నీ ఇన్‌చార్జీల పాలనలో కొనసాగాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వం వార్డెన్లను నియమించడంతో 31 మంది వార్డెన్లు జిల్లాకు కేటాయించారు. వీరితో సాంఘిక సంక్షేమ శాఖలో ఉన్న ఖాళీలనీ భర్తీ చేశారు. అదేవిధంగా ఎస్టీ వసతి గృహాలకు చెందిన 46 హాస్టల్స్ ఉన్నాయి. అందులో ప్రీమెట్రిక్ 25, పోస్ట్‌మెట్రిక్ 21 హాస్టల్స్ ఉన్నాయి. కాగా ప్రీమెట్రిక్‌లో 1,924, పోస్ట్‌మెట్రిక్ లో 2,300 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ వసతి గృహాల్లో 46మందికి 32మంది రెగ్యులర్ వార్డెన్లు మాత్రమే ఉన్నారు. ఇంతకాలం మిగతా వసతిగృహాల బాధ్యతలను ఇన్‌చార్జీలకు అప్పగించారు. అయితే నూతనంగా వార్డెన్లను నియమించడంతో జిల్లాలో సమస్య తీరినట్టయింది. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి జిల్లాలో 27 వసతిగృహాలు ఉన్నాయి. ఇంతకాలం ఏడుగురు వార్డెన్లు ఉండగా, ఖాళీగా ఉన్న మిగతా వాటిని ప్రభుత్వం పూర్తిస్థాయిలో భర్తీ చేసింది. ఖాళీల భర్తీతో హాస్టళ్లపై పర్యవేక్షణ పెరగడంతోపాటు విద్యార్థుల సమస్యలు తీరనున్నాయని భావిస్తున్నారు.

విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు

బిల్లు తీసుకోవాలి

▸ నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్టు అమలు

▸ జేడీఏ శ్రవణ్‌కుమార్

▸ 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



నల్లగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి 'ఆంధ్రజ్యోతి' బుధవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో ఫోన్‌చేసి సలహాలు, సూచనలు పొందారు. విత్తనాలతో పాటు రైతుభరోసాపై పలు ప్రశ్నలు అడిగారు. దీనికి తోడు ఏ విత్తనాలు వినియోగించాలి? ఏ ఎరువులు వాడాలనేదానిపై సలహాలు తీసుకున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ అమలు చేస్తామని జేడీఏ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, శివప్రసాద్, కీర్తి, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి మండలంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? : అంజయ్య, రైతు, చింతపల్లి

జేడీఏ: చింతపల్లి మండలంలో పత్తి విత్తనాలతో పాటు అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. స్వయంగా అధికారులు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఏవైనా విత్తన సమస్యలు ఎదురైతే అధికారులను సంప్రదించాలి.

తెగుళ్ల నివారణకు ఎలాంటి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి? కె.లింగమయ్య, డిండి

జేడీఏ: పత్తిలో బీటీ-2 రకాలు ఉన్నాయి. ఈ విత్తనాల మిగతా 8వ పేజీలో...

సాగర్ జలవిద్యుత్ కేంద్రంలో

టర్బైన్‌కు మరమ్మతులు



నాగార్జునసాగర్‌కు బీహెచ్‌ఈఎల్ నుంచి తీసుకువచ్చిన టర్బైన్‌లోని పరికరాలు

▸ అరిగిన టర్బైన్ వెయిన్స్.. టర్బైన్ పరికరాలు, వెయిన్స్ ఏర్పాటు

▸ రూ.70లక్షల వ్యయంతో మరమ్మతులు

▸ జూన్ 30 నాటికి పనులు పూర్తి: జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్

నాగార్జునసాగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో మొదటి టర్బైన్‌కు మరమ్మతులు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉన్నాయి. వాటిల్లో మొదటి టర్బైన్ హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కి టెక్నాలజీకి సంబంధించింది కాగా మిగతా 7 టర్బైన్లు జపాన్‌కు చెందినవి. వీటిలో బీహెచ్‌ఈఎల్‌కి చెందిన టర్బైన్ 110మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, జపాన్ పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన టర్బైన్లు 100.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటుంది. మొదటి టర్బైన్‌కు మరమ్మతులు చేసి 20 సంవత్సరాలు అవుతుండటంతో క్యాపిటల్ ఓవరాల్ చేస్తున్నారు. మొదటి టర్బైన్ వెయిన్స్ అరగడంతో (వార్న్ అవుట్) విద్యుదుత్పత్తి సమయంలో నీటి వృథాతో (నీరు లీకేజీ కావడంతో) పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి చేయడం కష్టమవుతుందని సీఈ తెలిపారు. దీంతో బీహెచ్‌ఈఎల్ నుంచి రూ.70లక్షల వ్యయంతో టర్బైన్ పరికరాలు, నూతన వెయిన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని మెకానికల్ విభాగంలో ఇంజనీర్లు మరమ్మతులు చేస్తున్నారని, మొదటి టర్బైన్ మరమ్మతులు జూన్ 30వ తేదీ వరకు పూర్తి చేస్తామని, బీహెచ్‌ఈఎల్ నుంచి నూతన టర్బైన్ తీసుకువచ్చామన్నారు.

అత్యధికంగా వరి సాగయ్యే రాష్ట్రంగా తెలంగాణ

▸ రైతులు యూరియా వాడకం తగ్గించాలి

▸ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా, ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల

చిట్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కువ వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, అలాగే రైతుల నుంచి ఎక్కువ ధాన్యం కొనుగోలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించిందన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. వానాకాలం నాట్లు వేసేలోగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమచేస్తామని, రైతును నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు తక్కువగా నీరు అవసరమయ్యే పంటలను ఎంచుకోవాలని, యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. ఆయిల్‌పామ్, వక్క, జాజికాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 10వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగవుతోందని, ఇక్కడ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థిరమైన, శాశ్వతమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని కొనియాడారు. వ్యవసాయాన్ని పండగ చేసేందుకు రైతులు సహకరించాలన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎంతో చరిత్ర ఉన్న చిట్యాల మార్కెట్ గౌరవాన్ని కొత్త పాలక వర్గం నిలబెట్టాలన్నారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసి కార్యకర్తలను సంతృప్తి పరచాలన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, చిట్యాలలో జాతీయరహదారిపై నిర్మించే ఫ్లైఓవర్ పరిధిలో మూడు అండర్‌పాస్‌లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, చిట్యాల మండలంలోని ఎనిమిది గ్రామాలను చిట్యాల మార్కెట్ పరిధిలో చేర్చాలని, నార్కట్‌పల్లి సబ్ మార్కెట్‌ను మార్కెట్‌గా మార్చాలని కోరారు. అంతకుముందు చిట్యాల మార్కెట్ ఆధ్వర్యంలో రూ.1.40కోట్లతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి తుమ్మల ప్రారంభించారు. అనంతరం చిట్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నర్రా వినోదమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా అయితరాజు యాదయ్య, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ ఏడీ ఛాయదేవి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుంకరి మల్లేష్‌గౌడ్, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ

శిశు విక్రయ ముఠాకు బేడీలు

- 13 మంది ముఠాసభ్యుల అరెస్ట్
- 28 మంది శిశువుల విక్రయం
- 10 మందిని సంరక్షించిన పోలీసులు
- నిందితుల్లో ఒకరు యూపీలోని లక్నో జైలులోనే..

వివరాలు మెయిన్ 14లో..

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

▸ మూడున్నర ఏళ్లలో 20వేల ఇందిరమ్మ ఇళ్లు

▸ కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుకు మంజూరు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌లు అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలో నియోజకవర్గానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పారదర్శకంగా, శాస్త్రీయంగా రూపొందించినట్లు తెలిపారు. మొదటి విడత ఇల్లురాని వారు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇసుకను ఉచితంగా ప్రభుత్వమే అందజేస్తుందని, అందుకు ఆర్డీవో, తహసీల్దార్‌కు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాపీని చూపించాలని కోరారు. దేవరకొండ నియోజకవర్గంలో 2346 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): లూజ్, నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు నకిలీ విత్తనాలు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ముందుగానే వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున పంటల సాగులో రైతులు ఇబ్బందులుపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్టు వ్యవసాయాధికారుల దృష్టికి వస్తే పోలీసుల సహకారం తీసుకుని వారిని కట్టడి చేయాలన్నారు. రాత్రి సమయాల్లో కల్తీ విత్తనాలు విక్రయించేవారు బృందాలుగా ఏర్పడి తిరుగుతారని, ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీచేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్

జీవాలకు టీకాలు వేయించాలి

పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్

మర్రిగూడ, మే 28 (ఆంధ్రజ్యోతి): పశువులకు, గొర్రెలకు సీజన్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించేలని జిల్లా పశువైద్యాధికారి జీవీ.రమేష్ సూచించారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని పశు వైద్య ఆస్పత్రిని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మే మాసంలో వర్షాలు కురుస్తున్నందున గొర్రెలు పశువులు లేత గడ్డిని మేయడం వల్ల వాటికి గొంతు, జబ్బ వాపు, గాలి కుంటూ వ్యాధులు, సోకే ప్రమాదం ఉందన్నారు. అందుకు టీకాలు వేయించాలన్నారు. అంతకుముందు పశు వైద్య ఆస్పత్రి భవనాన్ని ఆయన పరిశీలించారు వర్షాలు కురుస్తున్నందున భవనంపై నుంచి వర్షం నీరు కురుస్తుందని, మరమ్మతులు చేయించాలన్నారు. కొత్త ట్రావీస్‌ను ఏర్పాటు చేయాలని పశువైద్యాధికారి సురేందర్‌ను కోరారు. ఆయన వెంట పశుగణాంక సహాయకుడు ఎల్లేష్, తదితరులు ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థల పరిశీలన



ప్రభుత్వ స్థలం వివరాలు అడిగితెలుసుకుంటున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్

నాగార్జునసాగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): సాగర్ నియోజవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయడంతో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్ బుధవారం సాగర్ హిల్‌కాలనీలో స్థల పరిశీలన చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), అనుముల మండలాల్లో స్థల పరిశీలన చేశారు. పెద్దవూర మండలంలో చలకుర్తి గ్రామంలో ఎన్ఎస్పీ భూములను గత వారం కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. తాజాగా, సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాల వెనక వైపున నాట్కో ఫార్మా క్వార్టర్ల పక్కన ఉన్న ఎన్ఎస్పీ, అటవీ, రెవెన్యూ భూములను సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి జానారెడ్డి నివాసంలో గంటన్నరపాటు సమావేశమయ్యారు. ఆయన వెంట సాగర్ ఇన్‌చార్జి ఎస్ఈ మల్లిఖార్జున్‌రావు, పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అటవీశాఖ సాగర్ రేంజర్ రాఘవేంద్ర, ఎఫ్ఎస్‌వో రమేష్, ఉన్నారు.

మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా సబ్ కలెక్టర్ అమిత్

మిర్యాలగూడ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వెంటనే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్య విధులకు సక్రమంగా హాజరు కాని కారణంగా డైరెక్టరేట్‌కు సరెండర్ చేస్తున్నట్లు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సుబ్రహ్మణ్యం, నరేందర్, వెంకట్‌కు షోకాజ్ జారీచేశారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

● శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



వట్టిమర్తిలో సీసీరోడ్డు ప్రారంభంలో పాల్గొన్న చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి బస్‌స్టేజీ నుంచి గ్రామం వరకు నిర్మించిన 1.6కి.మీ సీసీరోడ్డును బుధవారం ప్రారంభించారు. స్థానికంగా జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ దేవత కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలకు మౌలిక వసతులతోపాటు రోడ్డు సౌకర్యం కూడా ఎంతో ముఖ్యమన్నారు. రహదారులు సరిగా ఉంటేనే ఆయా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చిట్యాల మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా పురుషుడు ఎన్టీఆర్

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు మహా పురుషుడు అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మధుసూదన్ రెడ్డి, నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్వీ యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి 43 ఏళ్లయినా ఎన్టీఆర్ ఆశయాలు, సిద్ధాంతాలను ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు పాటిస్తున్నాయన్నారు. నాడు ఎన్‌టీఆర్ తెలుగువారి ఔన్నత్యాన్ని కాపాడి దశదిశలా కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింపజేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు కూరెళ్ల విజయ్‌కుమార్, ఆకునూరి సత్యనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, జంపాల చంద్రశేఖర్, బక్కతోళ్ళ ఇస్తారి, ఎంఎ రఫీక్, సిద్ధిక్, తేలు రవి, ఆరేళ్ల కొండలు, గంగాధర స్వరాజ్ పాల్గొన్నారు.

బస్సులు సకాలంలో నడపాలి

మిర్యాలగూడ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): బస్సులు సకాలంలో నడపాలని బీసీ సంక్షేమ సంఘ నాయకురాలు బంటు కవిత కోరారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు డిపో పరిధిలోని అన్ని గ్రామాలకు సకాలంలో బస్సులు నడిపించాలన్నారు. బస్‌స్టేషన్‌తో పాటు పట్టణ పరిధిలోని స్టాపులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని కోరారు.

నకిలీ పత్తి విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

తిరుమలగిరి(సాగర్), మే 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్తి విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఏవో హర్షిత. బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మండలంలో సుమారు 19వేల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉందన్నారు. బోల్‌గార్డ్(బీజీ 2)విత్తనాల ప్యాకెట్ రూ.901 మాత్రమేనని, విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు బిల్లును తీసుకోవాలన్నారు.

బిల్లు తీసుకోవాలి


ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న జేడీఏ శ్రవణ్ కుమార్, అధికారులు

(5వ పేజీ తరువాయి)

వల్ల లద్దె పురుగులతో పాటు శనగపచ్చ పురుగును కూడా నివారించవచ్చు. జూన్ మొదటి, రెండో వారంలో మంచి వర్షాలు కురిసిన తరువాత విత్తనాలను వేసుకోవచ్చు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతుల బిల్లు తప్పనిసరిగా పొంది సీజన్ పూర్తయ్యే వరకు అందుబాటులో ఉంచుకోవాలి. ఎవరైనా డీలర్లు బిల్లు ఇవ్వకపోతే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. బిల్లు ఇవ్వని డీలర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు విక్రయాలను నిలిపివేస్తాం.

రైతు: గులాబీ రంగు తెగులు రాకుండా పత్తి విత్తనాలు ఉన్నాయా? బంగారు రవి, మునుగోడు

జేడీఏ: బీటీ-1తో పాటు బీటీ-2 రకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విత్తనాల వల్ల గులాబీ రంగు తెగులు రాకుండా ఉంటుం ది. పంటల మార్పిడి వల్ల అధిక దిగుబడి వస్తుంది. పత్తి విత్తనాలను నాణ్యమైనవి కొనుగోలు చేయాలి. పంటమార్పిడి వల్ల కూడా దిగుబడి అధికంగా వస్తుంది. ప్రస్తుతం 120రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. విత్తనాలకు బిల్లులు తప్పనిసరిగా పొందాలి. పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి సపోర్టు ఉంటుంది.

రైతు: భూదార్ కార్డు ఇవ్వడానికి అధికారులు ఏర్పాట్లు చేశారా? నాగరాజు, అనంతారం, నల్లగొండ

జేడీఏ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ప్రతీ రైతుకు ఇవ్వడం జరుగుతుంది. అందులో భాగంగా ఆధార్ మాదిరిగానే భూదార్ కార్డును ఇస్తున్నాం. ఇప్పటి వరకు 40వేల మంది నమోదు చేసుకోగా 11వేల కార్డులు వచ్చాయి. ఇకపోతే సన్నరకం ధాన్యానికి సంబంధించి రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుంది. గత వానాకాలం సీజన్‌లో రూ.37 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసింది.

రైతు: యాంత్రీకరణ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారు? భిక్షమాచారి, మిర్యాలగూడ, నవీన్‌రెడ్డి, తిప్పర్తి

జేడీఏ: ప్రభుత్వం ఇప్పటికే యాంత్రీకరణ పథకానికి నిధులు కేటాయించింది. దరఖాస్తులు కూడా తీసుకున్నాం. యాంత్రీకరణ పథకాన్ని త్వరలోనే అమలుచేస్తాం. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

రైతు: అధిక దిగుబడికి ఎలాంటి పంటలు వేయాలి? గుండెబోయిన మల్లేష్, చిన్న నారాయణపురం

జేడీఏ: పంటలు అధిక దిగుబడి రావాలంటే విత్తనాల ఎంపికను చేసుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. అధిక పంటల దిగుబడికి పంటల మార్పిడితో పాటు కందులు కూడా వేయవచ్చు.

రైతు: రాయితీపై ఏ విత్తనాలు ఇస్తున్నారు? నాగరాజు, బుద్దారం

జేడీఏ: భూసారం పెంచడం కోసం జీలుగ విత్తనాలను ఇస్తు న్నాం. అధిక దిగుబడుల కోసం రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దకు మాత్రమే రైతులు వెళ్లాలి.

రైతు: పత్తి దిగుబడి రావడం లేదు? శేఖర్ రెడ్డి, బుద్దారం, నల్లగొండ

జేడీఏ: పత్తి అధిక దిగుబడి రావాలంటే తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలి. దీనివల్ల దిగుబడి పెరుగుతుంది. కంది పంటను కూడా వేసుకోవచ్చు.

రైతు: సన్న రకాలకు సంబంధించి ఏ విత్తనాలు వాడాలి? శేఖర్‌రెడ్డి, అన్నెపర్తి

జేడీఏ: సన్నరకాలకు సంబంధించి అనేక రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అధీకృత డీలర్ల వద్ద నాణ్యమైన రకాల విత్తనాలను కొనుగోలు చేయాలి. అదేవిధంగా పత్తి విత్తనాలకు సంబంధించి బీటీ-2 రకాలు అందుబాటులో ఉన్నాయి.

రైతు: సన్నరకానికి బోనస్ చెల్లిస్తారా? లచ్చయ్య, గొల్లగూడెం

జేడీఏ: ప్రభుత్వం సన్నరకాలకు సంబంధించి క్వింటాల్ రూ.500 బోనస్ చెల్లిస్తుంది. 120 రోజులల్లో వచ్చే సన్నరకాలు అందుబాటులో ఉన్నా యి. మంచి దిగుబడి కూడా వస్తుంది.

రైతు: విత్తనాలు వెదజల్లే విధానంతో ప్రయోజనం ఏ మేరకు ఉంటుంది? హుస్సేన్, డిండి

జేడీఏ: విత్తనాలు వెదజల్లే పద్ధతి వల్ల డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుంది. కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది. పత్తి, సన్నరకాల ధాన్యానికి సంబంధించి అధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేయాలి. పత్తి ప్యాకెట్ ధర రూ.901 ఉంది.

రైతు: సన్నరకాలు పండిస్తున్నాం. బోనస్ తప్పనిసరిగా వస్తుం దా? బస్వ సత్యనారాయణ, తానేదార్‌పల్లి, వెంకట్‌రెడ్డి, తిప్పలమ్మగూడెం, కోటిరెడ్డి, తిప్పర్తి

జేడీఏ: సన్నరకం పండించే ధాన్యానికి సంబంధించి బోనస్ రూ.500 తప్పనిసరిగా వస్తుంది. సన్నరకాలు పండించే రైతుకు ప్రోత్సాహం ఉంటుంది. నచ్చిన సన్నరకాలను రైతులు కొనుగోలు చేయాలి. అదేవిధంగా 40 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

రైతు: ఇప్పటి వరకు రైతుభరోసా వేయలేదు? వెంకటయ్య, కొండమల్లేపల్లి

జేడీఏ: మీకు ఒక ఎకరం నాలుగు గుంటలు ఉందని చెప్పారు. నాలుగు ఎకరాల వరకు ఇప్పటికే రైతుభరోసా నిధులు పడ్డాయి. సాంకేతిక కారణాల వల్ల ఆగిపోవచ్చు. స్థానిక ఏవోను సంప్రదించాలి. ఎందుకు రాలేదనే దానిపై సమాధానం ఇస్తారు. తప్పనిసరిగా ప్రతీ రైతుకు రైతుభరోసా నిధులు వస్తాయి.

మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు : తహసీల్దార్


మట్టిని తరలిస్తున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాగ్యానాయక్

అడవిదేవులపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): మట్టిని అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాగ్యానాయక్ హెచ్చరించారు. మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామ సమీపంలోని గుట్ట ప్రాంతంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రాగ్యానాయక్ బుధవారం రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ఆ ప్రదేశానికి పరిశీలించారు. వాహనాలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులను నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ శ్యామ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ స్వామి, పోలీస్ సిబ్బంది మంగ్యా, పూర్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింహారెడ్డి

దేవరకొండ, మే 28(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైనందున ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు ముందస్తుగానే కురుస్తున్నందున ఐకేపీ కేంద్రాల్లోని ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, నాయకులు నూనె రామస్వామి పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మించవద్దని నిరసన


సెల్‌టవర్ కోసం తవ్విన గుంత వద్ద జంకుతండా వాసుల నిరసన

మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులో సెల్‌టవర్ నిర్మించవద్దని జంకుతండా వాసులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామశివారులోని జంకుతండా వద్ద ఎయిర్‌టెల్ టవర్ కోసం తీసిన గుంత వద్ద బుధవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఉమర్, అఖిల్, ఇబ్రహిం మాట్లాడుతూ ఇప్పటికే గ్రామం చుట్టూ ఏర్పాటు చేసిన పరిశ్రమల కారణంగా ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి ప్రవేశించి గ్రామస్థులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నట్లు తెలిపారు. సెల్‌టవర్ నిర్మించడం వల్ల రేడియేషన్‌కు గురై మరింత ఇబ్బందికి గురవుతారని పేర్కొన్నారు. వెంటనే సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నగేష్, ప్రసాద్, ఉస్మాన్, భాస్కర్, నిర్మల, మైసమ్మ, ఖయ్యూం, నజీర్, మదీనా, యూన్సీ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుమలగిరి(సాగర్), మే 28(ఆంధ్రజ్యోతి): కర్రకు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా మారింది. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్న సమస్యపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'కరెంట్ కు కర్రే ఆధారం' అనే కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించారు. సమస్యను పరిష్కరించాలని లైన్‌మెన్ కొండలును ఆదేశించారు. దీంతో ఆయన కర్రకు ఉన్న వైర్లను తొలగించి విద్యుత్ స్తంభానికి బిగించి సమస్యను పరిష్కరించారు.

కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకోవాలి

తిరుమలగిరి(సాగర్), మే 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కబ్జాకు గురైన పలు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మండలం ఏర్పాటై ఎనిమిదేళ్లు దాటినా నేటికి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని అన్నారు. కబ్జాకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాలకు, బీసీ బాలుర హాస్టల్, బీసీ గురుకుల పాఠశాలకు భూములను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు నల్లబెల్లి జగదీష్, వేములకొండ పుల్లయ్య, చాంద్ పాషా, గోపి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): 743 మంది మల్టీ పర్పస్ వర్కర్లకు రూ. 10లక్షల ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించే బాధ్యత తనదేనని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పచ్చర్లబావి సమీపంలో రైతు వేదికలో డీఎల్‌పీవో శంకర్ నాయక్ అధ్యక్షతన పారిశుధ్యం, తడి చెత్త, పొడి చెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వర్మీ కంపోస్టు తయారీపై సిబ్బందికి నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ కార్యక్రమాలను గ్రామపంచాయతీ అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్లాస్టిక్ నియంత్రణ, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించిన అనంతరం కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, దూదిపాల రేఖేందర్‌రెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, దూదిపాల వేణుధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, ఉట్కూరి వేమన్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌గౌడ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, యుగంధర్‌రెడ్డి, శ్రీకాంత్, ఎంపిడివో బాలరాజురెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులంతా చిత్తశుద్ధితో పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అధికారులు, ఉద్యోగులందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశించారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వారం రోజులకోసారి సమీక్ష నిర్వహిస్తానన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయలేదని, నివేదిక అందిచలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై విధుల పట్ల, పౌరసేవలందించడంలో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. పాలనాపరమైన అంశాలపై మునిసిపల్ ఉద్యోగులు, వార్డు ఆఫీసర్లకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ అమిత్‌నారాయణ్, కమిషనర్ యూసుఫ్ పాల్గొన్నారు.

సమాచారం


నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

చింతపల్లి మే 28(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల కేంద్రంలో ఓ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌తో పాటు పలువురు ప్రముఖులు హజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

చింతపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాంమూర్తి హెచ్చరించారు. బుధవారం చింతపల్లి మండల కేంద్రంతో పాటు వెంకటేశ్వరనగర్(గొడుకొండ్ల) చెక్ పోస్టు సమీపంలో డ్రండెన్ డ్రైవ్ నిర్వహించి, కేసులు నమోదు చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది సైదయ్య, శ్రీనివాస్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్ల గుర్తింపు


ఇంటి యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తిస్తున్నారు. మునిసిపాలిటీ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా టీపీవో కట్టెబోయిన అంజయ్య మాట్లాడుతూ మునిసిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు వార్డు ఆఫీసర్ల సహకారంతో పాత పట్టణంలో పర్యటించి శిథిలావస్థకు చేరిన 20 ఇళ్లను గుర్తించామన్నారు. వర్షాకాలం ఆరంభమవుతున్న తరుణంలో అటువంటి ఇళ్లలో నివసించడం ప్రమాదకరమన్నారు. ఇప్పటికే గుర్తించిన ఇళ్ల యజమానులకు నోటీసులు అందజేశామన్నారు. వారం రోజుల పాటు పట్టణమంతా పర్యటించి శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించడంతో పాటు ఆయా యజమానులను అప్రమత్తం చేస్తామన్నారు. ఆయనవెంట టీపీఈ చరణ్‌తేజ్, ఎజాజ్ ఉన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


మిర్యాలగూడ: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలని టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో చెరగని ముద్ర వేసిన ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పలు పథకాలు రూపొందించి అమలు చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో పయనిస్తూ ఆశయ సాధనకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జడ్పీ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమాలలో టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు బొంగరాల మట్టయ్య, నసీరుద్దీన్‌బాబా, చావల వెంకటేశ్వర్లు, రావిరాల నాగేందర్, పోగుల సైదులుగౌడ్, కాసుల సత్యం, దాసోజు కాంతాచారి, తారందాసు విష్ణు, గోపాలరావు, అనంతరాములు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

● నివాళ్లర్పించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి..

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నివాళ్లర్పించారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ పాల్గొన్నారు.

నిడమనూరు : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ అనుముల మండల అధ్యక్షుడు ఉడుతూరి నర్సింహారెడ్డి, కర్నె రమణారెడ్డి, ఉన్నం నారాయణ; సీనియర్ నాయకులు కోమటి వెంకన్న, కట్ట నర్సింహారావు, మేక సత్తిబాబు, సీతయ్య, యాదయ్య, పగిడిమర్రి ఎల్లయ్య, శ్రీను, సుబ్బారావు పాల్గొన్నారు.

వేములపల్లి : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర నాయకుడు జడ రాములుయాదవ్, టీడీపీ జిల్లా నాయకులు షేక్ రసూల్, జయరామాచారి, జడ మల్లేష్, గుండెబోయిన మల్లయ్య, జడ బీమయ్య, జక్కుల సాంబయ్య, రాజు పాల్గొన్నారు.

అవెన్యూ ప్లాంటేషన్ బిల్లుల చెల్లింపులపై విచారణ చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం న ఆయకులు గౌతంరెడ్డి తదితరులు

సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు సీపీఎం వినతి

మిర్యాలగూడ, మే 28(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ మున్సిపాలిటీలో అవెన్యూ ప్లాంటేషన్‌లో జరిగిన బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ చేట్టాలని సిపిఎం టూటౌన్ కార్యదర్శి బావండ్ల పాండు కోరారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ఇంచార్జీ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరంలో గ్రీన్‌బడ్జెట్ కింద పట్టణ పరిధిలోని నందిపాడు బైపాస్ నుంచి ఖలీల్‌దాబా వరకు అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టేందుకు రూ. 70 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతో 90 రోజుల్లో ప్లాంటేషన్ చేయాల్సివుండగా కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదని అన్నారు. ఆ సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల బదిలీల్లో భాగంగా మున్సిపల్ అధికారలు ట్రాన్స్‌ఫర్ కావడంతో పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. మొక్కలు నాటకుండానే నాడు ప్లాంటేషన్ కింద మంజూరైన రూ. 70 లక్షల రూపాయల నిధులను చెక్కు రూపంలో డ్రా చేశారని ఆరోపించారు. మున్సిపాలిటీలో గత 10 ఏళ్లుగా అనేక లక్షల అవినీతి జరిగిందని సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలి

పట్టణంలోని ఈదులగూడ శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని వన్‌టౌన్ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి కోరారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికకు ప్రహరిగోడ నిర్మాణం చేయాలని, బోరు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మూడావత్ రవినాయక్, ఆయూబ్, గోవర్ధనా, మాధవరెడ్డి, మల్లయ్య, కృష్ణయ్య, నాగేశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు అమలుచేయాలి

ఎస్సీ, ఎస్టీలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని టీఆర్‌జీఎస్ వ్యవస్థాపకుడు ధీరావత్ రవినాయక్ కోరారు. ఈ మేరకు మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. శ్రీనునాయక్, నాగునాయక్, నరేష్‌నాయక్, గణేష్ పాల్గొన్నారు.

వార్డెన్ల కొరత తీరింది

(5వ పేజీ తరువాయి)

సమస్యల వలయంలో మగ్గాయి. చాలావరకు సొంతభవనాలు శిథిలావస్థకు చేరాయి. పూర్తిగా సౌకర్యాల లేమితో కొనసాగుతున్నాయి. విద్యార్థులు అవస్థల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు. మురుగుదొడ్లకు నీటివసతి లేదు. కొన్ని వసతి గృహాల్లోని గదులు పెచ్చులూడు తున్నాయి. కిటికీలకు తలుపులు లేవు. వీటి పరిష్కారానికి ప్రభుత్వం నిధులు అందించాలని అధికారులు కోరుతున్నారు. సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి జిల్లాలో 59 వసతిగృహాలు ఉండగా, అందులో 23 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించి 2023 నుంచి సుమారు రూ.18లక్షలకు పైగా అద్దె చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో 17 నెలలుగా అవి పెండింగ్‌లో ఉన్నాయి. బీసీ వసతిగృహాలకు సుమారు రెండేళ్లకు రూ.2.88కోట్లు ప్రభుత్వం అద్దెగా చెల్లించాల్సి ఉంది. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి మొత్తం 27 వసతిగృహాలు ఉండగా, అందులో 8అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటికి కూడా ప్రభుత్వం రెండేళ్లుగా సుమారు రూ.18 లక్షలకు పైగా అద్దె పెండింగ్‌లో ఉంది. దీంతో అద్దెభవనాల స్థానంలో పక్కా భవనాలు నిర్మించాలని అటు విద్యార్థి సంఘాలతో పాటు వసతిగృహ విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న భక్తులు

పెద్దవూర, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి గ్రామంలో బుధవారం శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రస్వామి, ఆదిత్యాది నవగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితుడు శిరసనగండ్ల వెంకటనారాయణశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు సమక్షంలో ఐదు రోజులుగా విఘ్నేశ్వర పూజ పుణ్యాహవాచనం, జలాదివాసం, ధాన్యాదివాసం పూజలు నిర్వహించి బుధవారం ఉదయం 8.28గంటలకు వేద మంత్రోచ్ఛారణ మధ్య దేవతా మూలవిరాట్‌ల ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలోని యువకులు 41రోజుల పాటు నిష్ఠతో రామచంద్ర మాలను ధరించి ఆలయ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, బుసిరెడ్డి ఫౌండేషన్ అధినేత బుసిరెడ్డి పాండురంగారెడ్డి పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని బుసిరెడ్డి ఫౌండేషన్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నల్లమెట్టి కృష్ణ, నల్లమెట్టి రమణ, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

మిర్యాలగూడ

శ్రీనివాస	: సింగిల్
వెంకటేశ్వర	: మిషన్ ఇంపాసిబుల్
రాఘవ	: హిట్ 3
విట్రోస్	: హిట్ 3 , ఫైనల్ డిస్టినేషన్, బ్లడ్లీనెస్, ఎలెవన్

దేవరకొండ

మనోజ్	: మిషన్ ఇంపాసిబుల్, ఫైనల్ రాకింగ్
మైత్రి వెంకటేశ్వర	: యమదొంగ, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్